https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737



డీకే సారధ్యంలో

చాటింపు

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ సంపుటి : 18 సంచిక : 11 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ మంగళవారం,అక్టోబర్,6, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-

‘మా అనుమతి లేదు’..

ఫారమ్-6పై సుప్రీంకోర్టు షాకింగ్ కామెంట్స్

- ఫారమ్-6 మార్పులకు అనుమతి ఇవ్వలేదని సుప్రీంకోర్టు స్పష్టీకరణ- మార్పు ఎవరు చేశారో తెలుసుకుంటామన్న సీజేఐ- రికార్డులు చూశాకే పూర్తిస్థాయి విచారణ ఉంటుందని వెల్లడి- ఫారమ్-6ను సవరించలేదని ఈసీ స్పష్టీకరణ- ‘సర్’ కోసం అదనపు డిక్లరేషన్ మాత్రమే చేర్చామని వెల్లడి

న్యూఢిల్లీ,అక్టోబర్,05: కొత్త ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే ఫారమ్-6లో చేసిన మార్పులపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సవరించిన ఫారమ్-6కు తాము అనుమతి ఇవ్వలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని పూర్తిగా పరిశీలిస్తామని చెప్పారు. ఫారమ్-6లో అసలు మార్పు జరిగిందా? జరిగితే ఎవరు చేశారు? అనే విషయాలను తేల్చాల్సి ఉందని కోర్టు తెలిపింది. దీనికి సంబంధించిన రికార్డులు తమ ముందుకు వచ్చిన తర్వాతే అంశాన్ని లోతుగా పరిశీలిస్తామని సీజేఐ చెప్పారు. “సవరించిన ఫారమ్-6ను మేం ఆమోదించలేదు. ఇది స్పష్టం” అని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. అయితే ఫారమ్-6ను సవరించలేదని ఎన్నికల సంఘం చెబుతోంది. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (సర్) కోసం కొత్త ఓటర్లకు అదనపు డిక్లరేషన్ మాత్రమే జత చేశామని వివరిస్తోంది. ఈ అదనపు ప్రకటనను జులైలో చేర్చారు. ఇందులో తల్లిదండ్రులు లేదా తాత, అమ్మమ్మల పాత ఓటరు జాబితా వివరాలను అనుసంధానించాల్సి ఉంటుంది. ఫారమ్-6 రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్-1960లో భాగం. ఈ నిబంధనల్లో మార్పులు చేయాలంటే అధికారికంగా సవరణ చేయాల్సి ఉంటుంది. సెప్టెంబరు 29న తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే ఈ అంశాన్ని



లేవనెత్తారు. ఫారమ్-6 మార్పులకు సంబంధించి ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి ప్రతిపాదన న్యాయశాఖ ఆర్టీఐ సమాధానంలో చెప్పినట్లు ఆయన తెలిపారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఒంటరిగానే నిర్ణయాలు తీసుకున్నారా? అంశంపైనా సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. గత 10 నెలల్లో ‘సర్’కు సంబంధించిన నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు ఇటీవల ఓ కథనం వెలువడిన విషయం తెలిసిందే.

సామాన్యుడిపై ధరల భారం..

ప్రభుత్వం నిద్రమత్తులో ఉందా?

- సన్నబియ్యం ధరలు నాలుగు నెలల్లో 25 శాతం పెరిగాయన్న హరీష్ రావు- రైతుకు గిట్టుబాటు లేదు.. వినియోగదారుడికి అందుబాటు లేదని విమర్శ- ఉల్లిపాయ, వెల్లుల్లి, పప్పుల ధరలపై ప్రభుత్వాన్ని నిలదీత- బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలపై తక్షణ తనిఖీలకు డిమాండ్

హైదరాబాద్,అక్టోబర్,05: నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతూ సామాన్య పౌరుడి నడ్డి విరుస్తుంటే, వాటిని అదుపు చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంతో వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు హరీష్ రావు విమర్శించారు. సామాజిక మాధ్యమం ‘ఎక్స్’ వేదికగా ప్రభుత్వంపై విరుచుకుపడిన ఆయన, పౌరసరఫరాల శాఖ పర్యవేక్షణా రాహిత్యానికి సామాన్య ప్రజలే మూల్యం చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే సన్నబియ్యం ధరలు ఏకంగా 25 శాతం పెరగడం ప్రభుత్వ వైఫల్యానికి స్పష్టమైన నిదర్శనమని మండిపడ్డారు. రికార్డు స్థాయిలో పంట దిగుబడి సాధించామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం, ఉత్పత్తి పెరిగినప్పుడు మార్కెట్లో బియ్యం ధరలు ఎందుకు ఆకాశాన్ని అంటుతున్నాయో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ప్రభుత్వం రేషన్ ద్వారా ఇస్తున్న నాణ్యత లేని సన్నబియ్యాన్ని ప్రజలు వినియోగించడం లేదనడానికి, బయట మార్కెట్లో బియ్యం ధరలు అదుపు తప్పడమే ప్రధాన సాక్ష్యమని వ్యాఖ్యానించారు. ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతన్నకు మద్దతు ధర పేరిట నామమాత్రపు ధర మాత్రమే దక్కుతుంటే, మధ్యదళారులు మాత్రం క్వింటాకు రూ. 8,000 పైమాటే లాభపడుతున్నారని హరీష్ రావు ఆరోపించారు. రైతుకు గిట్టుబాటు ధర దక్కక, ఇటు వినియోగదారుడికి అందుబాటు ధరలో సరుకులు అందక తీవ్ర అవస్థలు పడుతుంటే కేవలం మధ్యవర్తులు మాత్రమే కోట్లు కొల్లగొడుతున్నారని ధ్వజమెత్తారు. కళ్లముందే ఈ దోపిడీ జరుగుతున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం శోచనీయమన్నారు. బియ్యం మాత్రమే కాకుండా ఉల్లిపాయలు రూ. 70, వెల్లుల్లి రూ. 240, పల్లి నూనె రూ. 210, పెసరపప్పు రూ. 125, కందిపప్పు రూ. 165 కు చేరుకోవడంతో సామాన్య కుటుంబాల వంటింటి బడ్జెట్ పూర్తిగా తలకిందులైందని తెలిపారు. ధరల పర్యవేక్షణను గాలికి వదిలేసి ప్రభుత్వం కేవలం ప్రేక్షక పాత్ర పోషిస్తోందని హరీష్ రావు మండిపడ్డారు. వ్యాపారులు సృష్టిస్తున్న కృత్రిమ కొరత, అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్ , అధిక మార్జిన్లపై తక్షణమే తనిఖీలు నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకుని సన్నబియ్యం సహా అన్ని నిత్యావసరాల ధరలకు అడ్డుకట్ట వేసి, పెరుగుతున్న ధరల భారం నుంచి సామాన్యుడికి ఉపశమనం కల్పించాలని ఆయన స్పష్టం చేశారు.



వైద్య రంగంలో ఈ ఏడాది ముగ్గురికి నోబెల్..

మెదడు రహస్యాలను ఛేదించిన ‘ఆప్టోజెనెటిక్స్’

ఆప్టోజెనెటిక్స్ అనే టెక్నిక్‌ను అభివృద్ధి చేసినందుకు ఈ గౌరవం

కాంతిని ఉపయోగించి మెదడులోని నరాల కణాలను నియంత్రించడం దీని ప్రత్యేకత

జ్ఞాపకాలు, భావోద్వేగాలను అర్థం చేసుకోవడంలో ఈ ఆవిష్కరణ ఒక మైలురాయి

న్యూఢిల్లీ,అక్టోబర్,05: ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ పురస్కారాల ప్రకటన ప్రారంభమైంది. 2026 సంవత్సరానికి గాను వైద్యశాస్త్రంలో (ఫిజియాలజీ/మెడిసిన్) ముగ్గురు శాస్త్రవేత్తలు సంయుక్తంగా ఈ అత్యున్నత పురస్కారానికి ఎంపికయ్యారు. అమెరికాకు చెందిన కార్ల్ డీస్సెరోత్ (స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ), జర్మనీకి చెందిన పీటర్ హెగెమాన్ (హంబోల్ట్ యూనివర్సిటీ), జార్జ్ నాజెల్ (వుర్జ్‌బర్గ్ యూనివర్సిటీ) ఈ గౌరవాన్ని దక్కించుకున్నారు. ‘కాంతి ఆధారిత అయాన్ చానెళ్లు, ఆప్టోజెనెటిక్స్’పై వారు చేసిన అద్భుతమైన ఆవిష్కరణలకు గాను నోబెల్ కమిటీ వారిని ఎంపిక చేసినట్లు సోమవారం ప్రకటించింది. ఈ ఆవిష్కరణ న్యూరోసైన్స్ (నాడీశాస్త్రం) రంగంలో ఒక కొత్త శకానికి నాంది పలికింది. మన మెదడు జ్ఞాపకాలను, భావోద్వేగాలను, ప్రవర్తనలను ఎలా నియంత్రిస్తుందనేది ఎన్నో శతాబ్దాలుగా ఒక పెద్ద మిస్టరీ. 20వ శతాబ్దంలో శాస్త్రవేత్తలు మెదడులోని ఏయే ప్రాంతాలు ఏయే పనులను ప్రభావితం చేస్తాయో పరిశోధించడం మొదలుపెట్టారు. కానీ, అప్పటి పద్ధతులతో కచ్చితమైన కారణాలను నిర్ధారించడం సాధ్యపడలేదు. వారి వద్ద ఉన్న మెదడు చిత్రం, ఎన్నో ప్రశ్నలతో, ఖాళీలతో నిండిన ఒక చిత్తుపటంగానే మిగిలిపోయింది. అయితే, ఆప్టోజెనెటిక్స్ రాకతో ఈ పరిస్థితి పూర్తిగా



మారిపోయింది. “ఒకప్పుడు కల అనుకున్న మెదడును మ్యాపింగ్ చేసే అవకాశాన్ని ఆప్టోజెనెటిక్స్ సాకారం చేసింది” అని నోబెల్ కమిటీ ఛైర్మన్ పెర్ స్వెన్నింగ్‌సన్ వ్యాఖ్యానించారు. ఈ అద్భుత ఆవిష్కరణకు పునాది వేసింది పీటర్ హెగెమాన్ జిజ్ఞాస. ‘క్లామిడోమోనాస్’ అనే ఒకే కణం కలిగిన నాచు (ఆల్గే) కాంతి ఉన్నవైపు ఎలా ఈదగలుగుతోందని ఆయన ఆలోచించారు. 2000ల ప్రారంభంలో, ఆయన తన సహచరుడు జార్జ్ నాజెల్‌తో కలిసి ఆ నాచు కణం ఉపరితలంపై ‘ఛానెల్‌రోడాప్సిన్’ అనే ఒక ప్రత్యేకమైన ప్రొటీన్‌ను కనుగొన్నారు.

8 మంది రాజ్యసభ అభ్యర్థుల్ని ప్రకటించిన బీజేపీ..

కేంద్రమంత్రి హర్దీప్ పూరీకి దక్కని అవకాశం

లక్నో,అక్టోబర్,05: ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల(రెండేళ్ల కొకసారి) కోసం భారతీయ జనతా పార్టీ ఎనిమిది మంది అభ్యర్థులను ప్రకటించింది. ధర్మపాల్ సింగ్, రాధాకాంత్ ఓజా, ప్రకాశ్ పాల్, విద్యాసాగర్ సోంకర్, గోపీ కృష్ణ పాండే, ప్రియాంక సింగ్ రావత్, రామ్ ప్రతాప్ సింగ్ చౌహాన్, శ్రుతి గంగ్వార్‌లను పార్టీ అభ్యర్థులుగా ఖరారు చేసింది. అయితే ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు, కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి మాత్రం ఈసారి చోటు దక్కలేదు. ఆయనతో పాటు మరో కేంద్ర మంత్రి బీఎల్ వర్మను కూడా పార్టీ మళ్లీ నామినేట్ చేయలేదు. ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు వారి పదవీకాలం ముగుస్తుండడంతో సోమవారం కొత్త జాబితాను ప్రకటించింది. ఉత్తరప్రదేశ్‌లో ఖాళీ కానున్న 10 రాజ్యసభ స్థానాలకు అక్టోబర్ 16న ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో బీజేపీకి రాష్ట్ర అసెంబ్లీలో ఉన్న ఎమ్మెల్యేల బలాన్ని బట్టి పలు స్థానాల్లో గెలిచే అవకాశం ఉంది. నామినేషన్ల దాఖలుకు గడువు అక్టోబర్ 6తో ముగియనుంది. బీజేపీ ఎనిమిది మంది అభ్యర్థులను ప్రకటించగా.. సమాజ్‌వాదీ పార్టీ ఇప్పటికే రామ్ గోపాల్ యాదవ్, ధన్‌రాజ్ నత్వానీలను అభ్యర్థులుగా ప్రకటించింది. మూడో అభ్యర్థిని కూడా బరిలోకి దింపే



అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. అసెంబ్లీలో ప్రస్తుతం ఎన్డీఏకు 289 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో బీజేపీ నుంచి 256 మంది, అప్నా దళ్ (ఎస్) నుంచి 13 మంది, నిషాద్ పార్టీ నుంచి ఐదుగురు, ఆర్ఎల్‌డీ నుంచి తొమ్మిది మంది, సుహెల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ (ఎస్‌బీఎస్‌పీ) నుంచి ఆరుగురు ఉన్నారు. బీజేపీకి ఇద్దరు జనసత్తా దళ్ (లోక్‌తాంత్రిక్) ఎమ్మెల్యేలు, ముగ్గురు స్వతంత్ర సభ్యుల మద్దతు కూడా లభించే అవకాశం ఉంది, దీంతో ఎన్డీఏ వాస్తవ బలం 294కు చేరుతుంది.

రామప్పను కాపాడేందుకు

పెద్దఎత్తున ఉద్యమిస్తాం: కేటీఆర్

హైదరాబాద్, అక్టోబరు 5 : సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (ఖ=) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములు దోచుకోవడం అయిపోయిందని.. ఇప్పుడు భూముల లోపల ఉన్న సంపద దోచుకొని, వారసత్వ కట్టడాలను కూల్చడానికి రేవంత్ సర్కార్ కుట్రలు పన్నుతుందని ధ్వజమత్తారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేటీఆర్ పోస్టు పెట్టారు. రామప్ప దేవాలయానికి అతి సమీపంలో ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవడం దారుణమని కేటీఆర్ మండిపడ్డారు. మీటర్ల కొద్ది లోతులో తవ్వకాలు, బ్లాస్టింగ్స్ చేయడం వల్ల తెలంగాణ శిల్పకళకు ప్రతిరూపం, యునెస్కో ద్వారా ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి, రామప్ప చెరువుకు తీవ్ర ముప్పు వాటిల్లనుందని హెచ్చరించారు. వారసత్వ సంపదను ధ్వంసం చేసే ఈ కుట్రలను బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు. ప్రఖ్యాత రామప్ప



దేవాలయానికి హాని చేసే ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ప్రతిపాదనను వెంటనే వెనక్కి తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని కేటీఆర్ హెచ్చరించారు.

తెలంగాణ హైకోర్టు సీజేకు పదోన్నతి..

సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా అపరేష్ కుమార్ సింగ్



హైదరాబాద్,అక్టోబర్,05: తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ పదోన్నతిపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ నుంచి అధికారికంగా నోటిఫికేషన్ వెలువడింది. న్యాయ వ్యవస్థలో ఆయన అందించిన విశిష్ట సేవలను గుర్తించి, కొలీజియం సిఫారసుల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ఈ నియామక ప్రక్రియను పూర్తి చేసింది. జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ సుప్రీంకోర్టు జడ్జిగా నియామకం ఖరారైనట్లుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకార్యాలయం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్ర హైకోర్టులో ఆయన చేపట్టిన పలు కీలక తీర్పులు, పరిపాలనా సంస్కరణలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. పదోన్నతి పొందిన జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ త్వరలోనే సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

గోల్డ్ షాప్‌లో భారీ చోరీ.. రూ.2 కోట్ల వజ్రాల అపహరణ

మేడ్చల్, అక్టోబర్ 5: మేడిపల్లిలోని ఓ బంగారం షాప్‌లో భారీ చోరీ



జరిగింది. అర్ధరాత్రి షాపు షెట్టర్ తొలగించి మరీ దుండగులు చోరీకి పాల్పడ్డారు. షాపులోకి ప్రవేశించిన దుండగులు సుమారు రూ.2 కోట్ల విలువ చేసే వజ్రాలను అపహరించినట్లు షాపు సిబ్బంది తెలిపారు. డైమెండ్స్‌తో పాటు బంగారు ఆభరణాలు కూడా చోరీకి గురైనట్లు మేనేజర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. వరంగల్ జాతీయ రహదారి మేడిపల్లి మెయిన్ రోడ్డులోని గోల్డ్ షాప్‌లో ఈ సంఘటన జరిగింది. సోమవారం ఉదయం షాప్‌కు వచ్చిన సిబ్బంది చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సిబ్బంది సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న మేడిపల్లి పోలీసులు, క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించే పనిలో ఉన్నారు. షాపులోని సీసీ కెమెరా ఫుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. దాదాపు ఏడు మంది దొంగలు చోరీ చేసినట్లు అనుమానిస్తున్నారు.

సర్ ప్రక్రియలో తప్పుడు దరఖాస్తులపై చర్యలు: సీఈవో సుదర్శన్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 5: తెలంగాణ సర్-2026పై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) సుదర్శన్ రెడ్డి ఈరోజు (సోమవారం) పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.కోసం ఉద్దేశించిన ఫామ్-7లో భారీగా దరఖాస్తులు దాఖలయ్యాయి. అయితే వాటిలో కొన్ని నకిలీవని ఆరోపణలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సీఈవో ఓటర్ల జాబితా సవరణపై తప్పుడు ప్రకటనలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఫామ్-6, 6ఏ, 7, 8లో కావాలని తప్పుడు సమాచారం ఇస్తున్న దరఖాస్తుదారులపై చర్యలు సుకోవాలన్నారు.ఓటర్ల పేర్ల తొలగింపు, అభ్యంతరాల కోసం ఉద్దేశించిన ఫామ్-7లో భారీగా దరఖాస్తులు దాఖలయ్యాయి. అయితే వాటిలో కొన్ని నకిలీవని ఆరోపణలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సీఈవో సుదర్శన్ రెడ్డి ఈ ఆదేశాలు జారీ చేశారు. ఫామ్-7లో తప్పుడు సమాచారం సమర్పిస్తున్న వారిపై ప్రజాప్రాతినిధ్య చట్టం--1950లోని



సెక్షన్ 31 ప్రకారం చర్యలు తీసుకోవాలని ఈఆర్ఓలకు ఆయన సూచించారు. చర్యలకు ముందు విచారణ నిర్వహించాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్--1960లోని రూల్ 20 ప్రకారం విచారణ సాగాలని చెప్పారు.

బీడీ కార్మికులు అర్హులందరికీ చేయూత పెన్షన్లు ఇవ్వాలి, రైతు రుణమాఫీ, 24 గంటల కరెంటు కై కలెక్టరేట్ ముందు ధర్నా



నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 05(డీకే చాటింపు): బీడీ కార్మికులు అందరికీ చేత పెన్షన్లు ఇవ్వాలని అదేవిధంగా కరెంటు కోతలు లేకుండా 24 గంటలు సరఫరా చేయాలని రైతుల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాతంత్ర నిజాంబాద్ యూనిట్ తరఫున సోమవారం కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తుందని రైతుల రుణమాఫీ 24 గంటల విద్యుత్తు అర్హులకు పెన్షన్లు తదితర హామీలు బుట్ట దాఖలు చేసింది అని కార్యదర్శి వనమాల కృష్ణ అన్నారు. లో ఓల్టేజ్ తో ట్రాన్స్ఫార్మర్లు కాలిపోయి బోర్ బావిలో మోటర్లు కాలిపోయి రైతులు అనేక ఆర్థిక నష్టాలకు గురవుతున్నారని వాపోయారు. రైతు రుణమాఫీ కూడా అందరికీ చేయకుండా కొంతమందికే రుణమాఫీ చేశారని అన్నారు. బీడీ కార్మికుల దరకాస్తు దారులు అందరికీ పెన్షన్ ఇవ్వాలని వృద్ధులకు, మహిళలకు 4000 పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధిక ధరలు నియంత్రించి నిత్యవసర వస్తువులను చౌక ధరలకు సరుకులను అందుబాటులో ఉంచాలని కోరారు. పైన పేర్కొన్న డిమాండ్లు పరిష్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వా దృష్టికి తీసుకెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్ ముందు పెద్ద ఎత్తున మహిళలు వ్యవసాయ కూలీలు రైతులు ధర్నా చేపట్టారు. ధర్నా అనంతరం జిల్లా అధికారులకు వినతిపత్రం అందించారు. ధర్నాలో జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ ,రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం నరేందర్, నిజామాబాద్ డివిజన్ కమిటీ కార్యదర్శి ఎం వెంకటి, బోధన్ డివిజన్ కార్యదర్శి డి రాజేశ్వర్, జిల్లా కమిటీ సభ్యులు కే గంగాధర్ ,మల్లేష్ సుధాకర్, కిషన్, తదితర మహిళా నాయకులు పాల్గొన్నారు.

డాక్టర్ నిర్లక్ష్యం - నిండు గర్భిణి బలి





మంచిర్యాల (డీకే చాటింపు): పట్టణంలో చోటుచేసుకున్న తల్లి, నవజాత శిశువు మృతి ఘటన తీవ్ర సంచలనంగా మారింది. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని గుడిపేటకు చెందిన గర్భిణి ప్రసవం కోసం ప్రైవేట్ ఆసుపత్రిలో చేరగా, చికిత్స అనంతరం తల్లి, బిడ్డ ఇద్దరూ ప్రాణాలు కోల్పోవడం విషాదానికి దారి తీసింది. ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి ఎదుట శవంతో ఆందోళనకు దిగడం పరిస్థితి తీవ్రతను చాటుతోంది. ప్రాణాలు కాపాడాల్సిన చోటే ప్రాణాలు పోయాయా. సంతోషకరమైన ప్రసవం కోసం ఆసుపత్రికి వెళ్లిన కుటుంబానికి చివరకు కన్నీళ్లు మాత్రమే మిగిలాయి. కుటుంబ సభ్యుల ఆరోపణల ప్రకారం, గర్భిణికి శస్త్రచికిత్స నిర్వహించిన తర్వాత ఆరోగ్య పరిస్థితి విషమించిందని, సరైన సమయంలో సమర్థవంతమైన చికిత్స అందకపోవడం తో పరిస్థితి అదుపుతప్పిందని చెబుతున్నారు..ప్రాణాలను రక్షించాల్సిన ఆసుపత్రిలోనే తల్లి, బిడ్డ ఇద్దరూ మృతి చెందడం అనేక అనుమానాలకు తావిస్తోంది.పరిస్థితి విషమించాకే హడావుడి మొదలైందా.. బంధువుల వాదన ప్రకారం, పరిస్థితి విషమించిన తర్వాత లేదా మృతి చెందిన అనంతరం మరో ఆసుపత్రికి తరలించే ప్రయత్నం జరిగిందని ఆరోపిస్తున్నారు. ఇది నిజమైతే మరిన్ని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రమాద సూచనలు ముందుగానే గుర్తించలేదా. అవసరమైన నిపుణుల సేవలు అందుబాటులో లేవా..అత్యవసర చికిత్సలో ఆలస్యం జరిగిందా.బాధ్యత నుంచి తప్పించుకునేందుకే రిఫర్ చేశారా. అనే ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది. శవంతో ఆందోళన.. న్యాయం కోసం కుటుంబ సభ్యుల డిమాండ్.. తల్లి, బిడ్డ మృతితో తీవ్ర ఆవేదనకు గురైన కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట శవంతో ఆందోళన చేపట్టినట్లు సమాచారం. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నా రు. స్థానిక ప్రజలు కూడా ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రైవేట్ ఆసుపత్రులపై పర్యవేక్షణ ఎక్కడ.ఈ ఘటనతో జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల పనితీరుపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అత్యవసర వైద్య సదుపాయాలు ఉన్నాయా..అర్హత కలిగిన వైద్యులు అందుబాటులో ఉన్నారా. క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనే సదుపాయాలు ఉన్నాయా. ఆరోగ్య శాఖ తనిఖీలు సక్రమంగా జరుగుతున్నాయా.. ఒక కుటుంబాన్ని కబళించిన విషాదం.. ఇంటికి కొత్త సభ్యుడు రావాల్సిన సమయంలో ఒకే కుటుంబంలో రెండు ప్రాణాలు కోల్పోవడం హృదయ విదారకంగా మారింది. ఈ ఘటన వెనుక అసలు కారణాలు ఏమిటో బయటపడాలని, బాధిత కుటుంబానికి న్యాయం జరగాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజలు అడుగుతున్న ప్రశ్నలు..తల్లి, బిడ్డ మృతికి అసలు కారణం ఏమిటి. శస్త్రచికిత్స అనంతరం పరిస్థితి ఎందుకు విషమించింది.. సరైన సమయంలో సరైన వైద్యం అందించారా.. మృతి తర్వాత మరో ఆసుపత్రికి తరలించే ప్రయత్నం జరి గిందా.. వైద్య నిర్లక్ష్యం ఉందా లేదా..?ఆరోగ్య శాఖ, జిల్లా యంత్రాంగం విచారణ చేపడతాయా.. బాధ్యులపై చర్యలు తీసుకుంటారా.. నిజాలు బయటపడాలి. ఒక తల్లి, ఒక పసిబిడ్డ ప్రాణం తిరిగి రాదు. కానీ ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులు ఏమిటో బయటపడాలి. విచారణ పారదర్శకంగా జరగాలి. బాధిత కుటుంబానికి న్యాయం జరగాలి. భవిష్యత్తులో మరో కుటుంబం ఇలాంటి విషాదాన్ని ఎదుర్కోకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

ఘనంగా గడ్డం వెంకటస్వామి 97వ జయంతి వేడుకలు



క్యాతన్ పల్లి (డీకే చాటింపు): కార్మికులు, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం జీవితాంతం పోరాడిన మహానేత, స్వర్గీయ శ్రీ గడ్డం వెంకటస్వామి (కాకా) 97వ జయంతి వేడుకలను రామకృష్ణాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.సూపర్ బజార్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాకా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం భగత్ సింగ్ నగర్ హట్స్ ఏరియాలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రామకృష్ణాపూర్ పట్టణ అధ్యక్షులు వొడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ,,. కాకా జీవితం ప్రజాసేవకు అంకితమైందని అన్నారు.కార్మికుల సంక్షేమం కోసం కాకా చేసిన కృషి, సింగరేణి కార్మికుల సమస్యలపై ఆయన పోరాటం, పేదలకు ఇళ్ల స్థలాలు కల్పించేందుకు చేసిన కృషి, విద్యా రంగంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా చేపట్టిన కార్యక్రమాలు ఆయన ప్రజా సేవా దృక్పథానికి నిదర్శనమని పేర్కొన్నారు. కాకా గారి కార్మిక, పేదల సంక్షేమ కార్యక్రమాలు ఆయన రాజకీయ వారసత్వంలో ముఖ్యమైన భాగంగా గుర్తించబడుతున్నాయి.
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కాకా తన రాజకీయ జీవితంలో బలమైన స్వరం వినిపించారని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రత్యేక రాష్ట్రం కోసం తన వంతు కృషి చేశారని వారు గుర్తు చేశారు.కాకా ఆశయాలను కొనసాగిస్తూ రాష్ట్ర మంత్రి శ్రీ గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ శ్రీ గడ్డం వంశీకృష్ణ ప్రజా సేవలో ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. కార్మికులు, యువత, పేదలు, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని తెలిపారు.విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు బెంచీలు, పుస్తకాలు, స్కూల్ బ్యాగులు, వాటర్ బాటిళ్లు తదితర విద్యా సామగ్రిని అందిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా విద్యాభివృద్ధికి సహకరించడం కాకా విద్యా సేవల స్ఫూర్తిని కొనసాగించడమేనని అన్నారు.ఈ సందర్భంగా భగత్ సింగ్ నగర్ హట్స్ ఏరియాలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వాటర్ బాటిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతతో పాటు విద్యకు ప్రోత్సాహం అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు.కాకా ఆశయాలను మాటల్లో మాత్రమే కాకుండా ప్రజాసేవ, కార్మిక సంక్షేమం, విద్యార్థుల అభివృద్ధి, పేదల సంక్షేమం ద్వారా ఆచరణలో కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మంతెన మల్లమ్మ, దాముఖ శిరీష, గుర్రం శ్రీనివాస్, భీమ మల్లేష్, పల్లె శ్రీదేవి, కూతురు ప్రభాకర్, రాష్ట్ర ఎస్సీసీఎల్ సెక్రటరీ చంద్రగిరి శ్రీనివాస్, జిల్లా స్పోక్స్ పర్సన్ అబ్దుల్ అజీజ్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగుల రాజ్ కుమార,ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు నక్క శ్రీనివాస్, పట్టణ కమిటీ నాయకులు కాసర్ల ప్రకాష్, బత్తుల శ్రీనివాస్, గోపు రాజం బత్తుల వేణు, ఎర్రబెల్లి రాజేష్,సృజన, ఏల్పుల సత్యనారాయణ, సీనియర్ ముఖ్య నాయకులు పల్లె రాజు, గాండ్ల సమ్మయ్య, గోపతి రాజయ్య, బొద్దుల ప్రేమ్ సాగర్, పైడకుల శ్రీనివాస్, ఐ ఎన్ టి యు సి నాయకులు గంగయ్య, గోపతి చంద్రయ్య, కట్కూరి సత్యనారాయణ రెడ్డి, కుదిరి రామస్వామి, రామ్ సాయి, అనూష, దీప, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సర్ ప్రక్రియ వెంటనే నిలిపి వేయాలి ప్రజావాణిలో ఫిర్యాదు



నిజామాబాద్ ప్రతినది అక్టోబర్ 05(డీకే చాటింపు):దేశవ్యాప్తంగా జరుగుతున్న సర్ ప్రక్రియను వెంటనే ఆపివేయాలని,భారత ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ కి సోమవారం మెమోరండం ఇచ్చారు.ఈ సందర్భంగా పార్టీ కార్యదర్శి ఆకుల పాపయ్య మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న సర్ ప్రక్రియకు సంబంధించిన ప్రజల్లో పలు సందేహాలు ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయన్నారు.ఎన్నికల కమిషన్ లో అవకతవకలు జరిగినట్టు బయట పౌర సమాజానికి విషయం తెలిసినదేనని, ఈ సందర్భంలో ఎస్ఐఆర్ ని నిలిపివేస్తూ ఎన్నికల కమిషన్ లో అవకతవకలకు పాల్పడిన జ్ఞానేశ్ కుమార్ ను వెంటనే తొలగించాలని, ఆయన తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కోరుతుందని పాపయ్య స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలో సర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని మరియు ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసము, పారదర్శకత, నిష్పక్షపాత, భావన మరింత బలపడే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నాము.అలాగే ఎన్నికల సంఘం పనితీరుపై మా పార్టీకి ఉన్న అభ్యంతరాలను పరిగణలోకి తీసుకొని ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని మా పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నాం అని ఆయన అన్నారు.ఎన్నికల కమిషనర్ పనితీరుపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి తో ఎన్నికల కమిషన్ లో జరిగిన అవకతవకలపై న్యాయ విచారణ చేయించాలి. కావున పై అంశాలకు సంబంధిత ఉన్న అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రజాస్వామ్య విలువలు మరియు ఓటు హక్కు పరిరక్షణకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి కోరారు.కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య, పార్టీ నాయకులు , డి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆధునిక నివాసాలను అందించాలి

ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి





ఎల్బీనగర్, (డీకే చాటింపు) నాణ్యమైన ఆధునిక నివాసాలను ప్రజలకు అందించాలని మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అన్నారు. నాగోల్ ఫతుల్లాగూడలోని గోల్డెన్ లీవ్స్ విల్లాస్ సమీపంలో మహాదేవ్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ (ఎంఐబి) ఆధ్వర్యంలో నిర్మించనున్న మెగా గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ ఈటెల రాజేందర్,ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజలో పాల్గొని, ప్రాజెక్టు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజలకు నాణ్యమైన, ఆధునిక సౌకర్యాలతో కూడిన నివాసాలను అందించాలనే లక్ష్యంతో ఈ మెగా గేటెడ్ కమ్యూనిటీని నిర్మించడం అభినందనీయమన్నారు. “విజన్ టు రియాలిటీ” లక్ష్యంతో ముందుకు సాగుతున్న మహాదేవ్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ,సంస్థ చైర్మన్ ఉ ఎండీ బి. రవి కుమార్, బీఆర్ఎస్ నాగోల్ డివిజన్ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి, సంస్థ ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. రవికుమార్ మాట్లాడుతూ, అందరికీ అందుబాటు ధరలలో అందించాలని నూతన పద్ధతులలో నిర్మాణాన్ని చేపట్టి సుశీలమైన ప్రాంతంలో విశాలంగా నిర్మాణం చేపట్టి కస్టమర్లకు అందించాలని ఉద్దేశంతోటి ఈ నిర్మాణాలను ఏర్పాటు చేశాము ఈ చక్కటి అవకాశాన్ని , సద్వినియోగం చేసుకోగలరని , ఈ సందర్భంగా తెలియజేశారు.

- భవానీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ దుర్గామాత ఆగమన్ ఉత్సవంలో పాల్గొన్నభవాని ప్రవీణ్ కుమార్



ఎల్బీనగర్, (డీకే చాటింపు)దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గడ్డిఅన్నారం డివిజన్ సాయిబాబా కాలనీ భవానీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న దుర్గామాత విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా శ్రీ దుర్గామాత ఆగమన్" (అమ్మవారి రాక) కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధల నడుమ, వైభవంగా నిర్వహించబడింది.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో గడ్డిఅన్నారం డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీ భవాని ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై, వివేకానంద నగర్ వద్ద జరిగిన ఆగమన్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ఈ తొమ్మిది రోజుల పాటు జరిగే దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో డివిజన్ ప్రజలందరూ విశేషంగా పాల్గొని, అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని కోరుకుంటున్నారు. ఆ జగజ్జనని దుర్గామాత దివ్య ఆశీస్సులతో మన గడ్డిఅన్నారం డివిజన్ ప్రజలందరూ యోగక్షేమాలతో, నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలు మరియు సుఖసంతోషాలతో విలసిల్లాలని ఆ మహిషాసురమర్దనిని మనస్ఫూర్తిగా పూజించారు.

విద్యార్థులకు సన్మార్గం చూపే నల్లబల్ల

ప్రపంచం ఎంత ఆధునికీకరణ గురవుతున్న బ్లాక్ బోర్డ్ ప్రాధాన్యత తగ్గుట లేదు. అలాంటి నల్లబల్లపై కవిత రాశారు ప్రముఖ కవి ,పండితులు రచయిత శ్రీ ఎర్రోజు వెంకటేశ్వర్లు. వీరు రాసిన లిబ్లాక్ బోర్డు వచనకవిత సంపుటిలో 57 కవితలున్నాయి.దీనిలో బాల్యం,సామాజిక సమస్యలు,పేదల బాధలు,గురువులు,గురుకులాలు,స్మృతి కవితలు..ఇలా వస్తువైవిధ్యం, అభివ్యక్తి నవ్యత కనిపిస్తున్నది.అందుకే బ్లాక్ బోర్డ్ సాహిత్యలోకంలో మంచి గుర్తింపు పొందింది. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలైన డా. ఎన్.గోపి,బహుభాషావేత్త డా.నలిమెల భాస్కర్ లు,కవి,విమర్శకులు ఆచార్య రఘు ఈ పుస్తకానికి పీఠికలు రాశారు.
ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా బ్లాక్ బోర్డ్ టైటిల్ కవిత విశిష్టతను తెలుసుకుందాం. అజరామర అక్షరాలు నల్ల మట్టిలో తెల్ల బంగారం పండినట్లు నల్లబల్ల సుద్దముక్కలతో జ్ఞాన దీపాన్ని విద్యార్థుల్లో వెలిగిస్తుందని వర్ణించడం ఎర్రోజుకే చెల్లింది. నల్లబల్లను నీలి మేఘం చేసిబీడు వారిన మెదడుపై తెలివితేటల పూలవానను కురిపించారు కవి. గురు శిష్యుల ను కలిపే వంతెనను బ్లాక్ బోర్డ్ తో నిర్మించారు. ప్రగతిని పెంచే తరగతి గదిని కనుగుడ్డుగా మలచి గురు శిష్యులకు మరో నేత్రం ఇదేనని అభివర్ణించారు ఎర్రోజు. చాక్ పీస్,బ్లాక్ బోర్డ్ లను భార్యాభర్తలుగా సంభావించి వాటి ప్రాధాన్యతను సమాజానికి తెలిపారు కవి అమ్మ పాలను తాగని పిల్లలుంటారేమో కానీ బోర్డ్ పై అఆలు,ఏబిసీడీలు చదవని అక్షరాస్యులుండరని తేల్చి చెప్పారు.అటెండర్ నుంచి ఐఏఎస్ వరకు అక్షరాలనేఅమ్మపాల కమ్మదనాన్ని రుచి చూపించేది నల్లబల్లేనని కుండబద్దలు కొట్టారు కవి. బోర్డ్ దేహమ్మీద సుద్దముక్కల దస్తూరిని సిల్వర్ ఫిలిగ్రీ ఆభరణాలతో వర్ణించడం తెలుగులో తొలి పోలికగా రికార్డ్ కు ఎక్కింది. ఈ వాక్యం రాజ్యాంగం అందించిన ప్రశ్నించే హక్కును పరిచయం చేసే



మహత్తర ఆయుధం నల్లబల్లని బల్లగుద్ది మరీ చెప్పారు ఎర్రోజు. గుండె గదుల్లో సుద్దముక్కల సవ్వడి మానవుడి జీవనాదని రాయగలిగిన నేటి కాలపు మేటికవి ఎర్రోజు వేంకటేశ్వర్లు కు అభినందనలు.

అల్లాడి చంద్రశేఖర్,
సంస్కృత ఉపన్యాసకులు,సిరిసిల్ల .
(ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా)

స్వామి నారాయణ భగవాన్ విగ్రహ ప్రతిష్టలో ఇందూరు వాసులు



నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 05 (డీకే చాటింపు):దక్షిణ ఆస్ట్రేలియా మౌంట్ గ్యాంబ్రియర్ పట్టణంలో అత్యంత ప్రతిష్టాత్మక మైనస్వామి నారాయణ హిందూ దేవాలయం ప్రారంభోత్సవ వేడుకలు వైభవంగా ఘనంగా జరిగాయి.ఆస్ట్రేలియా లో హిందూ దేవాలయ ప్రారంభోత్సవం విగ్రహ ప్రతిష్టాపన లో నిజామాబాద్ జిల్లా నుండి పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నామని తాటి వీరేశం లత దంపతులు అన్నారు.ఈ కార్యక్రమంలో రెండు రోజులపాటు జరిగిన వేడుకలలో సుమారు పదివేల మందికి పైగా భక్తులు, హాజరైనారు.మొదటి రోజు ప్రాణ ప్రతిష్ట గావించి విగ్రహాలను నగర సంకీర్తన ద్వారా ఊరేగింపుగా దేవాలయం వరకు తీసుకు వచ్చారు. ఈ ఊరేగింపులో కోలాటం, భక్తి గీతాలు, భక్తి నృత్యాలు చేస్తూ ఆనంద ఉత్సవాలతో ఊరేగించినారు. రెండవ రోజు విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ట గావించి స్వామి నారాయణ సంస్థ నిర్వాహ కులూ, గురువుల ఆశీర్వాదంతో వారి శిష్యుల ద్వారా పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఇట్టి కార్యక్రమంలో ఆలయ నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించిన శరద్ పటేల్, మరియు దేవ్ ప్రజాపతి , అడిలాయిడ్ లో నివసిస్తున్న తాటి సందీప్ రజిత కుటుంబ సభ్యులతో ఈ కార్యక్రమా లకు హాజరయ్యారు. సనాత హిందూ ధర్మాన్ని వివిధ దేశాలలో ప్రచారం చేస్తున్న స్వామినారాయణ్ భక్తులకు ఆలయాలు నిర్మిస్తున్న వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈరోజు నుంచి ఆలయం సందర్శనకు భక్తులకు అందుబాటులో ఉంచుతారని వివరించారు.

డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
మంగళవారం,అక్టోబర్,6, 2026

ఎల్‌నినో సవాలు..

2026 వర్షాకాలం మనకు నేర్పుతున్న శాస్త్రం, తత్వం, జీవన సత్యం ఏమిటంటే... జీవసృష్టి ఎప్పుడూ ఒకే సమాధానం చెప్పదనే. మనిషి ఒక సమస్యను చూస్తే, ఈ భూగోళం దానికి ఎన్నో ప్రత్యామ్నాయాలను తన గర్భంలోనే దాచిపెడుతుంది. మనం ఆకాశం వైపు చూసి వర్షాన్ని ఊహిస్తాం, శాస్త్రవేత్తలు ఉపగ్రహాల డేటాను విశ్లేషించి అంచనాలు వేస్తారు, రైతు మాత్రం నేలను తాకి కాలం గురించి చెబుతాడు. కానీ వాతావరణం ఎవరి అంచనాలకూ పూర్తిగా లొంగదు. తన సమతుల్యతను కాపాడుకోవడానికి ఎప్పటికప్పుడు స్వతంత్ర మార్గాలను వెతుక్కుంటుంది. 2026 నైరుతి రుతుపవనాలు మనకు నేర్పిన అత్యంత లోతైన పాఠం ఇదే. ఈ ఏడాది కథ కేవలం కురిసిన వర్షాల గురించి మాత్రమే కాదు. ఒక సంక్షోభం ఎదురైనప్పుడు సహజ ప్రపంచం తనలోని అంతర్గత శక్తిని ఎలా మేల్కొల్పుతుందో చెప్పే అరుదైన శాస్త్రీయ, తాత్విక కథనం ఇది. పసిఫిక్ మహాసముద్రంలోని నీటి ఉష్ణోగ్రత కొద్దిగా పెరగడం అనేది వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న భారత రైతు జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది? ఇదే వాతావరణ శాస్త్రంలోని సంక్లిష్టమైన "టెలికనెక్షన్స్" అద్భుతం. ఎల్ నినో అనేది ఒక ప్రాంత సమస్య కాదు. అది ప్రపంచ గాలుల లయను మార్చే శక్తి. మేఘాల ప్రయాణాన్ని అడ్డుకుంటూ, తేమ ప్రవాహాన్ని బలహీనపరిచి రుతుపవనాల క్రమాన్ని దెబ్బతీస్తుంది. ఈ ఏడాది జూన్ నెలలో సరిగ్గా అదే జరిగింది. ఎల్ నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే 10% కంటే ఎక్కువ లోటును నమోదు చేసింది. పశ్చిమ, మధ్య భారతదేశంలో పొలాలు ఎండిపోగా, విత్తనాలు రైతుల చేతుల్లోనే ఉండిపోయాయి. "ఈసారి కరువు తప్పదా?" అనే ప్రశ్న దేశమంతా వినిపించింది. కానీ జూలై రాగానే కథ ఊహించని మలుపు తిరిగింది. జూలైలో కురిసిన సమృద్ధియైన వర్షాలు జూన్ లోటును పూర్తిగా భర్తీ చేయడమే కాకుండా, సాధారణ స్థాయి కంటే అదనపు వర్షపాతాన్ని అందించాయి. ఒకే ఒక్క నెల వ్యవధిలో వాతావరణం తన సమీకరణాన్ని మార్చుకుంది. సాధారణంగా వర్షం అనగానే బెంగాల్ ఖాతంలో ఏర్పడే అల్పపీడనాలు, పసిఫిక్ నుంచి వీచే తేమ గాలులే గుర్తుకొస్తాయి. కానీ ఈసారి కథ కొంచెం భిన్నంగా సాగింది. మధ్య భారతదేశం, దక్షిణ భారతదేశం, పశ్చిమ కనుమలలో వేడెక్కిన నేలకూ, చుట్టూ ఉన్న సముద్రాలకు మధ్య ఉష్ణోగ్రత వ్యత్యాసం గణనీయంగా పెరిగింది. దీనికి స్థానిక తేమ తోడవడంతో ఉపఖండం లోపలే వరుసగా దేశీయ అల్పపీడన వ్యవస్థలు రూపుదిద్దుకున్నాయి. బయటి గాలుల సహకారం తగ్గినా, భారత ఉపఖండపు అంతర్గత వ్యవస్థలే సొంతంగా వర్ష మేఘాల గొలుసును నిర్మించుకున్నాయి. భారత వాతావరణ శాఖకి చెందిన నిపుణులు ఈ పరిణామాన్ని శాస్త్రీయంగా విశ్లేషిస్తూ: "పసిఫిక్ నుంచి తేమ ప్రవాహం క్షీణించినప్పుడు, భారత భూభాగంపై ఏర్పడిన స్థానిక అల్పపీడనాలు మరియు మధ్యప్రాంత వాతావరణ సుడిగుండాలు కలసి స్థానిక తేమను వర్షంగా మార్చాయి. ఇది అంతర్జాతీయ గాలులపై ఆధారపడకుండా నిలబడిన ఒక ప్రత్యేక స్థానిక వాతావరణ ప్రతిస్పందన." అన్నారు. జీవపరిణామ శాస్త్రంలో ఒక అందమైన సూత్రం ఉంది. అదే "రిజిలియెన్స్". అంటే దెబ్బతిన్న తర్వాత కూలిపోకుండా, కొత్త రూపంలో మళ్లీ నిలబడే సామర్థ్యం. నది ప్రవాహం: ఒక నదికి పెద్ద బండరాయి ఎదురైతే అది తన ప్రయాణాన్ని ఆపదు; ఆ రాయి పక్కనుంచే ఒక కొత్త దారిని సృష్టించుకుని ముందుకు సాగుతుంది. మానవ రోగనిరోధక వ్యవస్థ: మన శరీరానికి వైరస్ సోకినప్పుడు రోగనిరోధక వ్యవస్థ తన లోపల నుంచే కొత్త యాంటీబాడీలను తయారుచేసి పోరాడుతుంది. వెదురు చెట్టు: తుఫాను వచ్చినప్పుడు వెదురు చెట్టు విరిగిపోదు, గాలికి అనుగుణంగా వంగుతుంది. గాలి తగ్గగానే మళ్లీ నిటారుగా నిలబడుతుంది. సహజ ప్రపంచం కూడా సరిగ్గా ఇదే చేసింది. ఎల్ నినో ఒక దారిని బలహీనపరిస్తే, మన భారతీయ భూభాగం మరొక అంతర్గత దారిని తెరిచింది.

విలేకరులు కావలెను
రాజకీయ సంచలనాలకు ప్రతీకగా నిలిచిన
డీకే చాటింపు
తెలంగాణ దినపత్రిక
డీకే సారధ్యంలో చాటింపు దినపత్రికలో పనిచేయడానికి తెలంగాణాలోని అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పనిచేయడానికి ఆసక్తి, అనుభవం గల విలేకరులు కావలెను.
సంప్రదించండి :
సెల్ : 9603754136 - 7386287837

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి కల్పించాలి

విశ్వకర్మ జేఏసీ చైర్మన్ దేవరకొండ కాళిదాస్



డీకే చాటింపు ప్రతినిధి,(హైదరాబాద్): రాష్ట్రంలో పది లక్షలకు పైగా జనాభా కలిగిన విశ్వకర్మ సామాజిక వర్గానికి రాజకీయ ప్రాతినిధ్యం లేకపోవడం అన్యాయమని విశ్వకర్మ జేఏసీ చైర్మన్ దేవరకొండ కాళిదాస్ ఆవేదన వ్యక్తం చేశారు. సంప్రదాయ వృత్తుల ఆధారంగా విశ్వకర్మలను విభజించి చూపడం వల్ల వారి వాస్తవ జనాభా తక్కువగా కనిపిస్తోందని అన్నారు. బీసీ కోటాలో గవర్నర్ కోటా కింద విశ్వకర్మలకు ఎమ్మెల్సీ పదవి కల్పించాలని డిమాండ్ చేశారు.నగరంలోని సోమజీగూడా ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన విశ్వకర్మ జేఏసీ రౌండ్‌టేబుల్ సమావేశం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విశ్వకర్మలు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ రాజకీయంగా తగిన గుర్తింపు లభించడం లేదని కాళిదాసు పేర్కొన్నారు. కులవృత్తుల ఆధారంగా విశ్వకర్మలను వేర్వేరు వర్గాలుగా పరిగణించడం వల్ల సమష్టి జనాభా, సామాజిక బలం తెరమరుగవుతున్నాయని అన్నారు. విశ్వకర్మలందరినీ ఒకే సామాజిక సమూహంగా గుర్తించి వారి జనాభా, సమస్యలు, హక్కులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.పది లక్షలకు పైగా జనాభా ఉన్న సామాజిక వర్గానికి చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం లేకపోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆలోచించాల్సిన అంశమని పేర్కొన్నారు.
జనాభా ఉన్నప్పటికీ రాజకీయ నిర్ణయాల్లో భాగస్వామ్యం కల్పించకపోతే ఆ వర్గ సమస్యలు ప్రభుత్వాల దృష్టికి ఎలా వస్తాయని ప్రశ్నించారు.బీసీ వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యల్లో విశ్వకర్మలకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. ముఖ్యంగా గవర్నర్ కోటా కింద బీసీ సామాజిక వర్గానికి కేటాయించే ఎమ్మెల్సీ పదవుల్లో విశ్వకర్మలకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశ్వకర్మల రాజకీయ, సామాజిక, ఆర్థిక అభ్యున్నతి కోసం జేఏసీ ఆధ్వర్యంలో ఐక్య కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉందని కాళిదాస్ పిలుపునిచ్చారు.
వృత్తుల ఆధారంగా విడిపోయిన వారంతా సంఘటితమై తమ హక్కుల సాధనకు ముందుకు రావాలని సూచించారు. అందులో భాగంగా నవంబర్ 14న జేఏసీ ఎన్నికలు నిర్వహించాలని తీర్మానించారు. ఎన్నికల్లో విశ్వకర్మ కులానికి చెందిన ఐటీ, డాక్టర్స్, జర్నలిస్ట్,వివిధ రంగాల పెద్దలు, అధికారులను భాగస్వామ్యం చేస్తామని ఆయన పేర్కొన్నారు. విశ్వకర్మలకు రాజకీయ ప్రాతినిధ్యం, బీసీ కోటాలో సముచిత వాటా సంప్రదాయ వృత్తుల పరిరక్షణ తదితర అంశాలపై తమ అభిప్రాయాలను పలువురు వెల్లడించారు. విశ్వకర్మల డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ఐక్యంగా కృషి చేయాలని సమావేశం పిలుపునిచ్చింది.కార్యక్రమం లో విశ్వకర్మ జేఏసీ నాయకులు రవీంద్రాచారి, డాక్టర్ శ్యాం సుందర్ విరశేఖర చారీ లతో పాటు పెద్ద సంఖ్యలో విశ్వకర్మ లు పాల్గొన్నారు.

ఈ.వీ.ఎం గోదాము తనిఖీ

భద్రత ఏర్పాట్లు, సిసి కెమెరాల పనితీరులను పరిశీలించిన కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల, అక్టోబర్ 5,(డీకే చాటింపు) : సాధారణ తనిఖీ లో భాగంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు సోమవారం రోజున దరూర్ క్యాంప్ లో గల ఈవీఎం లను భద్రపరిచిన గోదామును తనిఖీ చేసిన జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతినెల ఈవీఎం లను తనిఖీ చేయడం జరుగుతుందని గోడౌన్ లోని యంత్రాల భద్రత, సిసి కెమెరాల పనితీరు, సాంకేతికపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించడం జరిగిందని తెలిపారు. గోదాము వద్ద ఎలాంటి లోపాలు లేకుండా పటిష్టమైన భద్రత ఉండాలని, నిత్యం అప్రమత్తతతో పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు. ఈ పర్యవేక్షణలో ఎన్నికల విభాగ పర్యవేక్షకురాలు జ్యోతి, జగిత్యాల అర్బన్ ఎమ్మార్వో రామ్మోహన్ మరియు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో అంగన్వాడీ ఉత్సవాలు...



బెల్లంపల్లి (డీకే చాటింపు)నరేంద్ర మోదీ 25 సంవత్సరాల సుపరిపాలన, అంకిత భావం సందర్భంగా సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు దార కళ్యాణి ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లకు మరియు ఆయాలకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అమురాజుల శ్రీదేవి బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమ జిల్లా కన్వీనర్ పట్టి వెంకట కృష్ణ హాజరై అంగన్వాడీ, టీచర్లకు ఆయాలకు శాలువాలతో సన్మానించారు. మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీప్రజా సేవకు ప్రతీకగా జరుగుతున్న 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమంలో భాగంగా... సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 7 వరకు దేశవ్యాప్తంగా 'అంగన్వాడీ ఉత్సవాలు' ఘనంగా నిర్వహించబడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు జిల్లా కార్యదర్శి రాచర్ల సంతోష్ కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎర్రోజు శ్రీనివాస్, సీనియర్ నాయకులు దూది ప్రకాష్, జీదుల రాములు, యువ మోర్చా అధ్యక్షుడు తోటపల్లి ఓం సాయి, ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షుడు ఇప్ప స్వామి, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఖర్జూరాల సాగులో మరో ముందడుగు

రైతు అన్నే సత్యనారాయణ





డీకే చాటింపు ప్రతినిధి,(హైదరాబాద్): ఖర్జూరాల సాగులో మరో విజయవంతమైన ముందడుగు పడిందని రైతు అన్నే సత్యనారాయణ తెలిపారు.మెదక్ జిల్లా రామాయంపేట ప్రాంతంలో ఆయన ఖర్జురం పంట పండిస్తున్నారు. వివరాలు వివరాలు సత్యనారాయణ మాటల్లోనే.... భారత్ డేట్స్ ఆర్గానిక్ ఖర్జూరాల తోటలో సీజన్‌కు భిన్నంగా, అనూహ్య సమయంలోనే ఖర్జూర పుష్పాలు రావడం ప్రారంభమయ్యాయి.ఇది కేవలం ఒక పుష్పించే ప్రక్రియ మాత్రమే కాదు.భారతీయ నేలలో ఖర్జూరాల సాగును విజయవంతంగా కొనసాగిస్తున్న మా వ్యవసాయ ప్రయాణానికి ఇది ఒక గొప్ప నిదర్శనం.సరైన సాగు పద్ధతులు, ప్రకృతి అనుకూల పరిస్థితులు, నిరంతర శ్రమతో తమ తోటలో ఖర్జూర పంట మంచి ఫలితాలను అందించే దిశగా ముందుకు సాగుతోంది. ప్రస్తుతం వచ్చిన ఈ పుష్పాల నుంచి సుమారు 4--5 నెలల్లో తాజా ఖర్జూరాలు కోతకు వచ్చే అవకాశం ఉంది. భారతదేశంలోనే సహజ పద్ధతుల్లో, నాణ్యమైన తాజా ఆర్గానిక్ ఖర్జూరాలను పండించి వినియోగదారులకు అందించడం. రైతు శ్రమకు ప్రకృతి తోడైతే, వ్యవసాయ విజయం మరింత అందంగా ఉంటుంది.మరిన్ని పంటల అప్‌డేట్స్ కోసం తమతో కలిసి రావాలని అన్నే విజ్ఞప్తి చేసారు.

రసవత్తరంగా జరిగిన రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ ఎన్నికలు

ఇందూరు సేవా సమితి ప్యానెల్ లో 11 మంది గెలుపు





నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 05 (డీకే చాటింపు): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిజాంబాద్ జిల్లా మేనేజింగ్ కమిటీ ఎన్నికలు ఆదివారం రసవత్తరంగా జరిగాయి. జిల్లా స్థాయిలో 15 మందితో మేనేజింగ్ కమిటీ కాగా 29 మంది పోటీపడ్డారు ,ఇందులో ముఖ్యంగా ఏళ్ల తరబడి ఉన్న కార్యవర్గం ఒకవైపు పోటీ చేయగ, మరోవైపు సేవే పరమావధిగా భావిస్తూ నేను సైతం పోటీ చేస్తామని ఇందూరు సేవా సమితి ఆధ్వర్యంలో కొత్తవారు పోటి పడ్డారు. ఇందూరు సేవా సమితి ఆధ్వర్యంలో పోటీకి దిగిన వారిలో 11 మంది కి ఓటర్లు పట్టం కట్టారు. ఈ విజయం పేదలు రోగులు అవసరాలకు అనుగుణంగా పనిచేస్తామని హామీపై గెలుపొందారు. ఈ ఎన్నికలలో 1552 మంది ఓటు హక్కు వినియోగించు కున్నారు. అందులోనుండి 1492 ఓట్లు చెల్లుబాటు అయ్యాయి. వరుసగా ఎక్కువ ఓట్లు సాధించిన అభ్యర్థులను ఎన్నికల అధికారులు గెలుపొందినట్లు ప్రకటించారు. ఇందూరు సేవా సమితి ప్యానల్ నుండి బాగు ల రంజిత్ సింగ్, చౌహన్ బాలాజీ ,దీకొండ యాదగిరి, డాక్టర్ శ్రీను నాయక్, జె అనిల్ కుమార్, కేంపుల నాగరాజు, కొండ సత్య ప్రసాద్ ,మల్లెపూల జగన్మోహన్ గౌడ్ ,పద్మ సుభాష్, పోతనకర్ లక్ష్మీనారాయణ, ఎండల సుధాకర్ గెలుపొందారు. బి ఆంజనేయులు, కర్పే రవీందర్, సుధాకర్, ఏ రవీందర్ లు కూడా గెలిచారు.

రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడిగా రిటైర్డ్‌పసిటివోలక్ష్మీనారాయణ





నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 05 (డీకే చాటింపు):నిజామాబాద్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికల అధికారిగా జిల్లా సహకార అధికారి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో జరిగాయి.15 గురు గెలుపొందిన సభ్యులచే ప్రమాణం చేయించారు. నిజామాబాద్ శాఖ అధ్యక్షుడిగా పోతంకర్ నారాయణ ను చైర్మన్ గా ఎన్నుకున్నారు.వైస్ చైర్మన్ గా డాక్టర్ శ్రీను నాయక్,కోశాధికారిగా కేంపుల నాగరాజు , అనగా స్టేట్ ఎం సి సభ్యుడుగా అనిల్ కుమార్ ఎన్నికయ్యారు.జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉంటామని, రెడ్ క్రాస్ ద్వారా ప్రజలకు మరింత చేరువ అవుతామని కార్యవర్గం ప్రతిజ్ఞ చేశారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

పలు సమస్యలపై వినతులు స్వీకరించిన కలెక్టర్ బి. సత్యప్రసాద్





జగిత్యాల, అక్టోబర్5,(డీకే చాటింపు) ప్రజావాణి ద్వారా ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులు, వినతులపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు. ప్రజల నుండి అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా తీసుకొని, సంబంధిత సమస్యపై సమగ్ర విచారణ జరిపి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 67 ఫిర్యాదులు, వినతులు అందాయని, వాటిని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకొని పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో పాటు దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందించాలని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్,డిఆర్ఓ కె. వై ప్రసాద్, ఆర్డీవో లు జీవాకర్ రెడ్డి, నరసింహ రావు,జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు మరియు తదితరులు పాల్గొన్నారు.

జిఎస్ఐ డివిజన్ జేఏసీ 23 కాలనీల తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- రాక్ టౌన్ ఏరియా లో ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలని జోనల్ కమిషనర్‌కు వినతి



హైదరాబాద్, (డీకే చాటింపు) ఎల్‌బీ నగర్ జోనల్ ఆఫీస్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో +ూ× డివిజన్ జేఏసీ 23 కాలనీల ప్రతినిధులు పాల్గొని, కాలనీలలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి త్వరగా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ ఆఫీస్ లో ప్రజావాణి నిర్వహిస్తున్న సీపీ శ్రీనివాస్ ని కోరారు. +ూ× డివిజన్ జేఏసీ 23 కాలనీలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు రాక్ టౌన్ ప్రాంతంలో ప్రతిపాదించిన ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పనును చేపట్టేలా హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు అధికారులతో సమన్వయం చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. ఈ సందర్భంగా గతంలో సమర్పించిన లేఖలు, వినతిపత్రాలను అధికారులకు చూపించి, సమస్య తీవ్రతను మరోసారి వివరించారు. అనంతరం +ూ× డివిజన్ జేఏసీ 23 కాలనీల తరఫున మరో వినతిపత్రాన్ని (జోనల్ కమిషనర్) సిపీ శ్రీనివాస్ కు అందజేశారు.రాక్ టౌన్ ప్రాంతంలో ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తయితే జి ఎస్ ఐ డివిజన్ జేఏసీ పరిధిలోని 23 కాలనీలకు తాగునీటి సరఫరా మెరుగుపడి, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని ప్రతినిధులు తెలిపారు. ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు ఈ అంశంపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ 23 కాలనీల సభ్యులు ఎర్ర వినోద్ రెడ్డి, బద్దం భాస్కర్ రెడ్డి, దయాకర్ రెడ్డి,మల్లేశం, సత్తి రెడ్డి ఉమేష్ గౌడ్, రవీందర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి,రాము,రామ్మోహన్,పున్న భాస్కర్ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

సాగు నీరు లేక ఎండుతున్న వరి పంట

-ఆందోళనలో రైతులు... -ధన్వాడ మండలంలో దయనీయ దృశ్యాలు... -యంనోని పల్లి గ్రామంలో కుమ్మరి కృష్ణయ్య,గౌని జయమ్మ రైతులకు భారీ నష్టం... -పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి... -రైతుల డిమాండ్





నారాయణపేట,(డీకే చాటింపు): వర్ష బావ పరిస్థితులతో నారాయణపేట జిల్లా ధన్వాడ మండలంలో వరి పంటకు సాగునీరు లభించక పలు గ్రామా ల్లో పంట ఎండుతుంది.పొట్ట దశకు వచ్చే సమయంలోనే వరి పంటకు సాగునీరు లభించకపోవడంతో ఎండుతుంది.చేతికొచ్చే పంటకు సాగునీరు లభించకపోవడంతో పంట ఎండిపోవడం..మరికొందరు రైతులు వరి పంట పొలంలో పశువులను పశుగ్రాసం కోసం తోలుతున్నారు.దాంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.వర్ష బావ పరిస్థితిల్లో ఈసారి నారాయణపేట జిల్లాలో వర్షాలు కురియలేదు.దాంతో తీవ్రస్థాయిలో వర్ష బావ పరిస్థితులు నెలకొన్నాయి. ఎలాగైనా సరే పంటలను కాపాడుకోవాలని ఆశించిన రైతులకు ప్రస్తుతం సాగునీరు లభించక ఎండుతున్న వరి పంటతో తీరని నిరాశ ఎదురయిందని చెప్పవచ్చు. ఒకవైపు వర్షాలు లేకపోవడం.

మరోవైపు భూగర్భ జలాలు ఇంకిపోయి బోర్లు ఎండిపోవడంతో రైతుల పెద్ద ఎత్తున నష్టపోవాల్సి వచ్చింది. ధన్వాడ మండలంతో పాటుత ఆ మండలం లోని యంనోని పల్లి గ్రామాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని మండల రైతులు కోరుతున్నారు.మండలంలోని ఏ గ్రామానికి వెళ్లిన ఎండిపోయిన వరి పంటల దృశ్యాలు మనకు దర్శనమిస్తున్నాయి.ధన్వాడ మండలం యంనోని పల్లి గ్రామానికి చెందిన రైతులు కుమ్మరి కృష్ణయ్య 5 ఎకరాల్లో,గౌని జయమ్మ 5 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు.నీటి కొరత కారణంగా ప్రస్తుతం బోర్లలో నీరు పూర్తిగా అడుగంటిపోవడంతో ఈ ఇద్దరు రైతుల వరి పంట పూర్తిగా ఎండిపోయింది. పంట సాగు కోసం ఒక్కొక్క రైతు సుమారు రూ.1,50 లక్షలు చొప్పున పెట్టుబడి పెట్టగా,నీరు అందుబాటులో లేకపోవడంతో పంట పూర్తిగా దెబ్బతిని తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లింది.ఈ ఇద్దరు రైతులకు కలిపి సుమారు రూ.3 లక్షల నష్టం జరిగినట్లు బాధిత రైతులు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే కరువు పరిస్థితులపై సమీక్షించి ధన్వాడ మండల కేంద్రంతో పాటు యంనోని పల్లి గ్రామాన్ని కరువు ప్రభావిత ప్రాంతంగా గుర్తించాలని రైతులు కోరుతున్నారు.పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపోయిన రైతులకు తగిన పంట నష్టపరిహారం,ఆర్థిక సహాయాన్ని అందించి, రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.అలాగే భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడకుండా సాగునీటి వనరులు,బోర్ల పరిస్థితి, ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండల రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. పంట నష్టపోయిన రైతులను తెలంగాణ ప్రభుత్వం తక్షణమే ఆర్థికంగా ఆదుకోవాలని, ధన్వాడ మండలాన్ని కరువు ప్రాంతంగా గుర్తించాలని ధన్వాడ మండల,యంనోని పల్లి గ్రామ రైతులు కోరుతున్నారు.ఏ గ్రామానికి వెళ్లిన ఎండిపోతున్న వరి పంట దృశ్యాలు దర్శనమిస్తున్నాయి.

డ్రైనేజీ సమస్యపై ఎమ్మెల్యే వినతి సమక్షంలో జోనల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేసిన పత్రం స్వర్ణకార సంఘ ప్రతినిధులు





ఎల్బీనగర్, (డీకే చాటింపు) మధురపురి కాలని రోడ్ నెంబర్. 4 స్వర్ణకార మార్కెట్ చౌరస్తాలో గత కొన్ని సంవత్సరాల నుండి ఉన్న సమస్య పై (రోడ్ డౌన్ ఉండడం) వల్ల వర్షాకాలంలో మరియు పైన డ్రైనేజీ ఓవర్ ఫ్లో అయినా మన చౌరస్తా లో నిలిచి పోయి ఉన్న వీడియో ని కమీషనర్ కి ఎమ్మెల్యేకి వివరిస్తూ మన వాళ్లకు మరియు మన కార్యక్రమాలకు తీవ్ర ఇబ్బంది జరుగుతున్న విషయం పై ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సమక్షంలో జోనల్ కమీషనర్ వికాస్ మహోత్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఇట్టి విషయం పై వారు సానుకూలంగా స్పందించడం జరిగింది.వినతి పత్రం ఇచ్చిన వారిలో అధ్యక్షులు కీర్తిగారి అనంతచారి, గౌరవ అధ్యక్షులు రాచకొండ శ్రీనివాసా చారి, ఉపాధ్యక్షులు తిరుపతా చారి, శ్రీనివాస్ చారి, గిరిధర్, ప్రభాకర్.. తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడుల వేటలో నెంబర్ 2 గా ఏపీ

విజయవాడ, : ఏపీలో కూటమి ప్రభుత్వం మరో రికార్డు సృష్టించింది. దేశంలోకి వస్తున్న కొత్త పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించడంలో గణనీయంగా తన పనితీరు మెరుగుపరుచుకుంది. ప్రముఖ జాతీయ బిజినెస్ పత్రిక బిజినెస్ స్టాండర్డ్స్ ప్రాజెక్టు టుడే నివేదికల ఆధారంగా విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం.. కొత్త పెట్టుబడులను ఆకర్షించడంలో జాతీయస్థాయిలో రెండవ స్థానంలో నిలిచింది. గత రెండేళ్ల వ్యవధిలో పెట్టుబడుల ర్యాంకింగ్స్ లో తొమ్మిదో స్థానం నుంచి.. ఏడు స్థానాలకు ఎగబాకి ద్వితీయ స్థానంలో నిలవడం విశేషం. ఇది నిజంగా గొప్ప విషయం. గడిచిన రెండేళ్లలో ఈ పురోగతి సాధించడం గొప్ప పరిణామం. కూటమి ప్రభుత్వానికి ఇది ఊతం ఇచ్చే విషయం. వైసిపి 2024 వరకు అధికారంలో ఉంది. ఆ ఏడాది ముగిసిన ఆర్థిక సంవత్సరంలో.. అంటే 2024 ఏప్రిల్ నాటికి కొత్త పెట్టుబడులను ఆకర్షిం చడంలో ఏపీ ప్రభుత్వం దేశంలో తొమ్మిది వ స్థానంలో నిలిచింది. ఆ తదుపరి ఏడాది ఆర్థిక సంవత్సరంలో క్రమేపి పనితీరు మెరుగు పరుచుకుంటూ వచ్చింది. ఇప్పుడు తాజాగా టాప్ 10 జాబితాలో రెండో స్థానంలో నిలవడం విశేషం. పారిశ్రామిక వాతావరణం, ప్రభుత్వ పాలసీల్లో వచ్చిన విప్లవాత్మక మార్పుల వల్లే ఈ గణనీయమైన పురోగతి సాధ్యమైంది.పారిశ్రామిక పెట్టుబడులను సాధించడంలో మహారాష్ట్ర ముందంజలో కొనసాగుతోంది. ఇప్పుడు దాని తర్వాత స్థానం ఏపీ దక్కించుకోవడం విశేషం. ఇతర అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను తట్టుకొని ఈ స్థానంలో నిలబడడం అనేది గొప్ప విషయం. ఒడిస్సా 5వ స్థానంలో ఉండడం గమనించదగ్గ విషయం.

జోగి రమేష్ ఎపిసోడ్ బతుకు జట్కాబండి సీరియల్



విజయవాడ, : రాజకీయాల్లో మైకుల ముందు నిలబడి ప్రత్యర్థులపై ఊగిపోతూ బూతులు అందుకోవడంలో స్పెషలిస్టులు అయిన జోగి ఫ్యామిలీ కుటుంబసభ్యులు ఇప్పుడు సొంత ఇంటి పంచాయతీలతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నారు. మాజీ మంత్రి జోగి రమేష్ ఇంట్లో జరుగుతున్న తాజా పరిణామాలు ఇప్పుడు సరిగ్గా ఏదో టీవీ ఛానల్ బతుకు జట్కా బండి పంచాయితీని తలపిస్తున్నాయి. కొడుకు వైవాహిక జీవితం, కోడలితో వివాదాలు, కుటుంబ సమస్యలు మీడియాకెక్కడంతో.. ఆ కుటుంబం బయటకు వచ్చి తలెత్తుకోవడం కష్టంగా మారుతోంది.కుమారుడి ఆరోగ్య పరిస్థితి, వ్యక్తిగత బలహీనతలు, కోడలు మేఘన చేసిన ఆరోపణలు ఇప్పటికే పబ్లిక్ డొమైన్‌లోకి వచ్చి బహిరంగ చర్చనీయాంశంగా మారాయి. ఇలాంటి అత్యంత సున్నితమైన వ్యక్తిగత సంక్షోభం ఎదురైనప్పుడు.. పరువు ప్రతిష్టలు ఉన్న కుటుంబాలు బాధితులతో చడీచప్పుడు కాకుండా సామరస్యపూర్వకంగా రాజీ చేసుకుని గుట్టుగా వ్యవహారాన్ని సర్దుబాటు చేసుకోవడం సహజం. కానీ, ఇక్కడ సీన్ రివర్స్ అయింది. నష్టనివారణ చర్యలు చేపట్టాల్సింది పోయి, ఆస్తిపాస్తులు, నగదు లావాదేవీలు, ఎదురు ఆరోపణల పేరిట రచ్చను మరింత పెద్దది చేసుకుంటూ కూర్చోవడం చూస్తుంటే కాలికి బురద అంటితే కడుక్కోవాల్సింది పోయి మొహం నిండా రాసుకున్నట్టు ఉందనే కామెంట్లు సోషల్ మీడియాలో పేలుతున్నాయి.డాది కిందట జోగి రమేష్ తన కుమారుడు రాజీవ్ కు సూర్యాపేటకు చెందిన మేఘనతో వివాహం చేయించారు. అయితే ఏడాది పాటు తనను కుటుంబ సభ్యులు ఇబ్బంది పెట్టారని మేఘన ఫిర్యాదు చేయడం సంచలనంగా మారింది. పోలీసులు గృహహింస కింద కేసు నమోదు చేశారు. అయితే ఇటీవల ఇరు కుటుంబాలు కొంతమంది పెద్దలతో కలిసి సమావేశమైనట్లు తెలుస్తోంది. అయితే జోగి రాజీవ్ తన తల్లిదండ్రులను తప్పుపడుతూ కొన్ని వ్యాఖ్యలు చేశారు. తరుణ్ వైట్ వాష్ చేసి పెళ్లికి ఒప్పించారని ఆయన చెబుతుండగా.. మరోవైపు మేఘన తనకు ఏడాది పాటు నరకం చూపించారని.. చంపేందుకు ప్రయత్నించారంటూ ఆరోపించారు. అయితే ఇరు కుటుంబాల వారు చేసిన వ్యాఖ్యలకు సంబంధించి ఈ వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. అయితే ఎవరు తీసారో తెలియదు కానీ ఈ వీడియోలు మీడియాకు అందాయి. దీంతో సోషల్ మీడియా కూడా కూస్తుండగా.. ప్రధాన మీడియాలో సైతం కథనాలు వస్తున్నాయి.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో మంత్రిగా పని చేశారు జోగి రమేష్. రాజకీయంగా చాలా దూకుడుగా ఉండేవారు. ప్రత్యర్థులపై వ్యక్తిగతంగా విమర్శలు చేసేవారు. ఇప్పుడు ఆయన కుటుంబ వ్యవహారం బయటకు రావడంతో పెద్ద ట్రోలింగ్ అవుతోంది సోషల్ మీడియాలో.. అయితే కోడలు మేఘన పోలీసులకు ఫిర్యాదు చేసిన సమయంలో ఇదంతా రాజకీయ కుట్రగా అభివర్ణించారు జోగి రమేష్. అయితే ఇప్పుడు నేరుగా వారి మధ్య జరిగిన పంచాయితీ బయటకు రావడం.. అటు కుమారుడు సైతం తిరగబడటం? కోడలు తరుపు కుటుంబ సభ్యులు సైతం కార్నర్ చేస్తుండడంతో జోగి రమేష్ ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. అయితే గతంలో ఆయనతో పాటు కుమారుడు చేసిన వ్యాఖ్యలను జోడిస్తూ.. కర్మ రిటర్న్ అంటూ ఎక్కువ మంది వ్యాఖ్యానిస్తున్నారు.ఒకప్పుడు నియోజకవర్గంలో చక్రం తిప్పి, ప్రత్యర్థుల ఇళ్లపైకి దండయాత్రలు చేసిన డాంబికాలు ఇప్పుడు సొంత ఇంటి సమస్యను పరిష్కరించుకోలేని నిస్సహాయత ముందు తేలిపోయాయి. కోడలి కుటుంబం చేస్తున్న ఆరోపణలు, పోలీస్ స్టేషన్ల మెట్లు ఎక్కడం, ప్రెస్ మీట్లలో పరస్పర నిందారోపణలు చేసుకోవడం వల్ల జోగి కుటుంబ పరువు బజారున పడటం తప్ప పైసా ప్రయోజనం కనిపించడం లేదు. అధికారం ఉన్నప్పుడు చూపిన తెగింపు, రాజీకొచ్చే విషయంలో వివేకంగా మారకపోవడమే ఈ వ్యవహారాన్ని మరింత నవ్వులపాలు చేస్తోందిరాజకీయాల్లో ప్రత్యర్థులు చేసే విమర్శల కంటే.. సొంత చేజేతులా రోడ్డున పడేసుకున్న పరువు వల్ల వెనుక నవ్వుకునే నవ్వులే ఎక్కువ చేటు తెస్తాయి. పోవాల్సిన పరువు ఇప్పటికే పోయింది, మిగిలిన కాస్త ఇజ్జత్ అయినా కాపాడుకోకపోతే ఈ'ఫ్యామిలీ డ్రామా ఎపిసోడ్లు మరింత నాని ప్రజల్లో జోగి ఫ్యామిలీని ఒక కమెడియన్ గ్రూప్‌గా మిగిల్చే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా మీడియా కెమెరాల ముందు డ్రామాలు ఆపి, నలుగురిలో నవ్వులపాలు కాకుండా చాపకింద నీరులా ఈ వివాదానికి తెరదించకపోతే? జోగి వెనుక సొంత పార్టీ నేతలే గుసగుసలాడుకుంటూ నవ్వుకోవడం ఖాయం.

బలపడుతున్న అనుమానాలు... పవన్ గైర్హాజరుపై సోషల్ మీడియా



విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇటీవలి కాలంలో కొన్ని కీలక ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరుకాకపోవడం, టీడీపీ–జనసేన సోషల్ మీడియా గ్రూపుల మధ్య నడుస్తున్న సైలెంట్ వార్ రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇటీవలి కాలంలో కొన్ని కీలక ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరుకాకపోవడం, టీడీపీ–జనసేన సోషల్ మీడియా గ్రూపుల మధ్య నడుస్తున్న సైలెంట్ వార్ రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తున్నాయి. పవన్ కల్యాణ్ కేబినెట్ సమావేశం, సీడ్ యాక్సెస్ రోడ్ ప్రారంభోత్సవం , రాజ్‌భవన్‌లో గవర్నర్ ఏర్పాటు చేసిన ఎట్ హోమ్ కార్యక్రమానికి దూరంగా ఉండటాన్ని వైఎస్సార్‌సీపీ పెద్ద ఎత్తున హైలైట్ చేసే ప్రయత్నం చేసింది. కూటమిలో విభేదాలు మొదలయ్యాయని ప్రచారం ప్రారంభించిందిఅగ్రనాయకులు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ పరస్పర గౌరవంతోనే ముందుకు సాగుతున్నప్పటికీ.. సోషల్ మీడియా వేదికగా కిందిస్థాయి కార్యకర్తలు, సానుభూతిపరుల మధ్య వివాదాలు ముదురుతుండటం ప్రతికూల అంశంగా మారింది. స్థానిక నియోజకవర్గాల్లో ప్రాధాన్యత, పనుల కేటాయింపులు, పోస్టింగ్స్ విషయంలో టీడీపీ–జనసేన శ్రేణుల మధ్య అసంతృప్తులు కనిపిస్తున్నాయి. ఒకరినొకరు టార్గెట్ చేసుకుంటూ పోస్టులు పెట్టుకోవడం ప్రత్యర్థులకు మంచి ఆయుధంగా మారుతోంది. అయితే ఈ సోషల్ మీడియా రచ్చను అరికట్టేందుకు ఇప్పటికే ఇరు పార్టీల అధినాయకత్వాలు హెచ్చరికలు జారీ చేస్తూ పరిస్థితిని కంట్రోల్ చేసే ప్రయత్నం చేస్తున్నాయి.వైసీపీ శ్రేణులు కూటమి దెబ్బతిందని ఎంత ప్రచారం చేస్తున్నప్పటికీ, సాధారణ ప్రజల్లో గానీ, ఓటర్లలో గానీ ఈ కథనాలపై విశ్వసనీయత కనిపించడం లేదు. 2024 ఎన్నికల్లో వచ్చిన భారీ విజయం కూటమి పునాది ఎంత బలంగా ఉందో స్పష్టం చేసింది. ప్రభుత్వపరంగా కీలక నిర్ణయాలు, సంక్షేమ పథకాల అమలు, అమరావతి పునర్నిర్మాణం వంటి ప్రతిష్టాత్మక అంశాల్లో చంద్రబాబు–పవన్ కల్యాణ్ ఇద్దరూ ఒకే మాటపై నడుస్తున్నారు. కాబట్టి కొన్ని చిన్న చిన్న గైర్హాజరులు , సోషల్ మీడియా పోస్టుల ఆధారంగా కూటమి బంధం బలహీనపడిందని వారు ఆనందపడే ప్రయత్నం చేస్తోంది.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కూటమికి అనలైన నవాలుగా మారనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల విజయాన్ని క్షేత్రస్థాయిలో నిలబెట్టుకోవాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల మధ్య సంపూర్ణ సమన్వయం అవసరం. గ్రామ స్థాయిలో స్థానాల సర్దుబాటు, నామినేషన్ల ఖరారు విషయంలో ఇరు పార్టీల మధ్య ఎలాంటి ఘర్షణ వాతావరణం రాకుండా చూసుకోవడమే అధినేతలకున్న పెద్ద టాస్క్. కింది స్థాయి క్యాడర్‌ను ఒకే వేదికపైకి తెచ్చి పోటీకి దించగలిగితే కూటమి తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించవచ్చు. పవన్ కల్యాణ్ గైర్హాజరుపై వస్తున్న ఊహాగానాలకు తెరపడాలంటే ఇరు పార్టీలు మరింత వ్యూహాత్మకంగా వ్యవహరించాల్సి ఉంది.

భోగాపురంలో బాదుడే....బాదుడు

విజయనగరం: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలు ప్రారంభం అయ్యాయి. నిన్నటి నుంచి పూర్తిస్థాయిలో రాకపోకలు ప్రారంభం కాగా.. తొలిరోజు 26 విమాన సర్వీసులు నడిచాయి. అయితే తొలి రోజు ప్రయాణికులకు కష్టాలు తప్పలేదు. విశాఖ నగరం నుంచి 20 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి. మరోవైపు ప్రతి అరగంటకు ఒక ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. కానీ ప్రతి రెండు గంటలకు ఒకసారి బస్సులు నడిచినట్లు ప్రయాణికులు చెబుతున్నారు. పైగా భోగాపురంలో ఆర్టీసీ బస్సులను ఆపేందుకు వీలుగా ఏర్పాట్లు చేయలేదు. ఇంకోవైపు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాంగణంలో చార్జీల బాదుడు అధికంగా ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా కమర్షియల్ వెహికల్ ఎంట్రీ, వెయిటింగ్ పేరుతో భారీగా చార్జీలు వసూలు చేస్తుండడం వివాదాలకు దారితీస్తోంది. ఒక డ్రైవర్ విమానాశ్రయం సిబ్బందిని నిలదీస్తున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వెలుగులోకి వచ్చింది.

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రయాణికులను తీసుకొచ్చాడు ఓ క్యాబ్ డ్రైవర్. అయితే ఆ డ్రైవర్ నుంచి సిబ్బంది ఏకంగా 600 రూపాయల కమర్షియల్ టాక్స్, వెయిటింగ్ ఛార్జ్ డిమాండ్ చేయడంతో డ్రైవర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. ప్రయాణికులను విమానాశ్రయంలో దించేందుకు 700 రూపాయలు తీసుకున్నానని.. కానీ విమానాశ్రయం లోపలికి ప్రవేశించగానే 600 రూపాయలు వసూలు చేయడం ఏంటని ప్రశ్నించాడు. ఇది ఎంత మాత్రం న్యాయం కాదని.. నిబంధనల పేరుతో క్యాబ్ డ్రైవర్లను నిలువునా దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. అయితే ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ వీడియో విపరీతంగా ట్రోల్ అవుతోంది.వాస్తవానికి విమానాశ్రయం డిస్నే బోర్డు పై పొందుపరిచిన పార్కింగ్, వెయిటింగ్ ఫీజుల ను మాత్రమే తీసుకోవాలి. అయితే ఈ డిస్నేలో సైతం భారీగా చార్జీలు కనిపిస్తున్నాయి. అయితే తాము చెప్పినట్టుగా 600 రూపాయలు ఇవ్వాల్సిందేనని ఎయిర్పోర్ట్ సిబ్బంది డిమాండ్ చేయగా.. సదరు డ్రైవర్ మాత్రం ఇచ్చేందుకు అంగీకరించలేదు. తనకు న్యాయం జరిగే వరకు కారును ఇక్కడి నుంచి కదిలించేది లేదని భీష్మించుకుని కూర్చున్నాడు. ఉన్నతాధికారుల్లో ఎవరికి ఫిర్యాదు చేయాలో చెప్పాలంటూ పట్టుపట్టాడు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య గట్టి వాదన జరిగింది. పక్కనున్న వారు ఈ వీడియోను తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో విపరీతంగా వైరల్ అయింది.

ఏఐఐబీ సహకారంతో స్కూళ్లకు మహర్దశ



నల్గొండ: తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలకు సరికొత్త రూపు ఇవ్వడంతో పాటు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల (టీపీఎస్) ఏర్పాటును వేగవంతం చేస్తోంది. అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలకు దీటుగా టీపీఎస్‌లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా కొత్తగా 73 టీపీఎస్‌ల నిర్మాణానికి తాజాగా పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ పాఠశాలల నిర్మాణానికి మొత్తం రూ.699.89 కోట్లను ఖర్చు చేయనున్నారు. ఇందులో రాష్ట్ర బడ్జెట్ నుంచి రూ.209.96 కోట్లు కేటాయించగా.. మరో రూ.489.93 కోట్లను ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ రుణంగా సమకూర్చనుంది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి నిర్మాణ ప్రక్రియను వేగంగా చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు, తెలంగాణ విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నెలలోనే నిర్మాణ పనులకు టెండర్లు పిలవనున్నట్లు టీజీఈడబ్ల్యూఐడీసీ ఎండీ గణపతిరెడ్డి తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా 100 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి గత ఫిబ్రవరిలో నిర్ణయించారు. ఇప్పటికే ఇబ్రహీంపట్నం, అచ్చంపేట నియోజకవర్గాల్లో రెండేసి చొప్పున, గజ్వేల్‌లో ఒక టీపీఎస్‌కు అనుమతులు లభించాయి. ఇబ్రహీంపట్నం పరిధిలోని ఆరుట్ల టీపీఎస్ ఇప్పటికే ప్రారంభమైంది. మిగిలిన పాఠశాలల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. తాజాగా ప్రతిపాదించిన 95 పాఠశాలల్లో 73కి ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో.. ఇప్పటివరకు మంజూరైన టీపీఎస్‌ల సంఖ్య 78కు చేరింది. మిగిలిన పాఠశాలలపై కూడా త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు భిన్నంగా టీపీఎస్‌లు సెమీ రెసిడెన్షియల్ విధానంలో పనిచేయనున్నాయి. ఇప్పటికే ఉన్న ప్రభుత్వ పాఠశాలలను కూడా అవసరమైన మౌలిక వసతులతో టీపీఎస్‌లుగా తీర్చిదిద్దనున్నారు. సాధారణంగా కనీసం రెండు నుంచి మూడు ఎకరాల స్థలం ఉన్న పాఠశాలలను ఎంపిక చేసి.. వాటి పరిధిలోని సమీపంలోని మరో రెండు, మూడు పాఠశాలలను విలీనం చేసే విధానాన్ని అనుసరించనున్నారు. అవకాశం ఉన్న ప్రాంతాల్లో సమీపంలోని జూనియర్ కళాశాలలను కూడా ఈ సముదాయాల్లోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది.

టీపీఎస్‌లలో విద్యార్థులకు తరగతి గదులతో పాటు క్రీడా మైదానాలు, బాస్కెట్‌బాల్, వాలీబాల్ కోర్టులు, గ్రంథాలయాలు, కంప్యూటర్-సైన్స్ ల్యాబ్‌లు, ప్రీప్రైమరీ విద్యార్థుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు వంటి సౌకర్యాలు కల్పించనున్నారు. ప్రీప్రైమరీ నుంచి పదో తరగతి లేదా ఇంటర్మీడియట్ వరకు నాణ్యమైన విద్యను ఒకే క్యాంపస్‌లో అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. పాఠశాలల విలీనం ద్వారా ఒక్కో టీపీఎస్‌లో విద్యార్థుల సంఖ్య కనీసం 1000 నుంచి 1500 వరకు ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఒకే ప్రాంగణంలో చదవడం ద్వారా మెరుగైన విద్యా వాతావరణం ఏర్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అదే సమయంలో ఉపాధ్యాయుల సంఖ్య పెరగడం, వనరులను సమర్థంగా వినియోగించడం వంటి ప్రయోజనాలు కూడా ఉంటాయని అధికారులు చెబుతున్నారు.సాధారణ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందుతున్న నేపథ్యంలో.. టీపీఎస్‌లలో సాయంత్రం కూడా అల్పాహారం అందించే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోంది. విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక నైపుణ్యాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచడమే టీపీఎస్‌ల ప్రధాన ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు.

కమలంలో కనిపించని అగ్రెసివ్ అప్రోచ్



హైదరాబాద్, : తెలంగాణ రాజకీయ రంగంలో భారతీయ జనతా పార్టీ ఒక ప్రత్యేకమైన సవాలును, అదే సమయంలో అపారమైన అవకాశాన్ని ఎదుర్కొంటోంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి బలమైన ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు కావాల్సిన సానుకూల పరిస్థితులు ఉన్నప్పటికీ, ఆ అవకాశాలను ప్రత్యక్ష రాజకీయ ప్రయోజనాలుగా మలచుకోవడంలో బీజేపీ పూర్తి స్థాయిలో సఫలీకృతం కాలేకపోతోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీ స్థానాలను గెలుచుకుని, 35 శాతం మేర ఓటు షేర్‌ను సాధించి తన ప్రాభవాన్ని చాటుకున్నప్పటికీ, ఆ ఊపును క్షేత్రస్థాయి స్థానిక నంన్థల ఎన్నికలు మరియు నియోజకవర్గ స్థాయిలో నిలబెట్టుకోవడంలో పార్టీ కొంత తడబడుతోంది.ప్రస్తుతం తెలంగాణ బీజేపీలో వ్యక్తమవుతున్న అతిపెద్ద లోపం బలమైన నిలకడైన నాయకత్వం . ఉత్తర తెలంగాణలో పార్టీకి గట్టి పట్టు ఉన్నప్పటికీ, తెలంగాణ వ్యాప్తంగా ఓటర్లను ఆకర్షించగల, సర్వమోదయోగ్యమైన అగ్రనేత కొరత స్పష్టంగా కనిపిస్తోంది. తరచూ మారుతున్న వ్యూహాలు, నాయకత్వ మార్పులు, అంతర్గత విబేధాలు క్యాడర్‌లో గందరగోళాన్ని నింపుతున్నాయి. ప్రజల సమస్యలపై నిలకడగా పోరాటం చేస్తూ, ప్రతీ నియోజకవర్గంలో పార్టీని నడిపించే ఒక పవర్‌ఫుల్ ఫేస్ లేకపోవడం పార్టీ విస్తరణకు ప్రధాన ప్రతిబంధకంగా మారిందిపాక్షికంగా బిఆర్ఎస్ వైఖరి పట్ల సానుభూతి, మెత్తటి వైఖరి అవలంబిస్తుందనే ప్రచారం కూడా బీజేపీకి రాజకీయంగా నష్టం చేకూరుస్తోంది. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనపై కోపంతో ఉన్న ఓటర్లు లేదా కాంగ్రెస్ పాలనపై అసంతృప్తి చెందుతున్న ప్రజలు ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు చూడాలంటే.. బీజేపీ స్పష్టమైన ప్రతిపక్ష పాత్రను పోషించాల్సి ఉంటుంది. బిఆర్ఎస్ గ్రాఫ్ పడిపోతున్న ప్రతిసారీ ఆ పార్టీ స్థానాన్ని ఆక్రమించడంలో వెనకబడితే, ఆ ఓటు బ్యాంక్ మొత్తం తిరిగి కాంగ్రెస్ వైపునకో లేదా స్వతంత్రుల వైపునకో మరలే ప్రమాదం ఉంది.భవిష్యత్తులో బీజేపీ అధికార పీఠానికి చేరువ కావాలంటే, బిఆర్ఎస్ సాంప్రదాయక ఓటు బ్యాంకును కైవసం చేసుకోవడమే ఏకైక మార్గం. ఒకప్పుడు బిఆర్ఎస్‌కు అండగా నిలిచిన గ్రామీణ, వెనుకబడిన వర్గాలు, తటస్థ ఓటర్లను తనవైపు తిప్పుకునేందుకు పక్కా ప్రణాళిక అవసరం. బిఆర్ఎస్ నాయకత్వం రెస్ట్ మోడ్‌లో ఉందనే భావన ప్రజల్లో ఉన్నప్పుడు, ఆ ఖాళీని బీజేపీ తన నిరంతర ప్రజా ఉద్యమాల ద్వారా భర్తీ చేయాలి. కేవలం హిందూత్వ ఎజెండా లేదా పార్లమెంట్ ఎన్నికల నాటి ఇమేజ్‌పైనే ఆధారపడకుండా, స్థానిక సమస్యలపై పోరాటం చేయాల్సి ఉంటుంది. అయితే ఈ మార్గం అనుకున్నంత సులువు కాదు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కాంగ్రెస్ తన సంక్షేమ పథకాలు, క్షేత్రస్థాయి యంత్రాంగంతో బలంగా నిలబడింది. బిఆర్ఎస్ ఓటు బ్యాంకును ఆకర్షించడంలో కాంగ్రెస్ సైతం తన మార్క్ చూపుతోంది. ఈ త్రికోణ పోటీలో బీజేపీ తన ప్రత్యర్థి కేవలం కాంగ్రెస్ మాత్రమేనని చాటిచెబుతూ, బిఆర్ఎస్ మిగిల్చిన రాజకీయ శూన్యాన్ని భర్తీ చేయడానికి సమగ్రమైన సంస్థాగత నిర్మాణం చేపడితే తప్ప అనుకున్న లక్ష్యం సాధ్యం కాదు.రాబోయే రెండేళ్ల సమయం తెలంగాణ బీజేపీకి అత్యంత కీలకమైనది. పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధి దాటి, గల్లీ స్థాయి వరకు కమిటీలను బలోపేతం చేసుకోవడం, ఇతర పార్టీల నుంచి సీనియర్ నేతలను ఆకర్షించడం మరియు ఓటర్లలో నమ్మకాన్ని కలిగించేలా ఏకీకృత నాయకత్వాన్ని తీసుకురావడం తక్షణ అవసరం. వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ, సానుభూతి రాజకీయాలను పక్కనబెట్టి అగ్రెసివ్ అప్రోచ్‌తో ముందుకు వెళ్తేనే తెలంగాణలో కమలం వికసించే అవకాశాలు మెరుగవుతాయి

నన్ను పర్సనల్ గా కలిస్తే... మార్కులిస్తా..? జేఎన్టీయూ ప్రొఫెసర్ వాట్సప్ చాట్..!

న్యూఢిల్లీ, : దేశంలోనే ఎంతో ప్రసిద్ధి చెందిన జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)లో మరోసారి తీవ్ర స్థాయి లైంగిక వేధింపుల ఆరోపణలు వెలుగుచూశాయి. ఒక ప్రొఫెసర్ తమ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని, ఆయనతో గడిపితే పరీక్షల్లో ఎక్కువ మార్కులు వేస్తానని ఆశచూపాడని ఆరోపిస్తూ.. ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 11 మంది విద్యార్థినులు విశ్వవిద్యాలయ అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ)ని ఆశ్రయించారు. ఈ తీవ్రమైన ఆరోపణల ఆధారంగా ఐసీసీ విచారణను వేగవంతం చేసింది. ముఖ్యంగా ఫిర్యాదు చేసిన విద్యార్థినులే స్వయంగా తమ ఎదుట హాజరై.. వాంగ్మూలాలు ఇవ్వాలని సూచించిందిమే మొదటి వారంలో జరిగిన వైవా పరీక్షల అనంతరం విద్యార్థులు మాత్రమే ఉన్న ఒక వాట్సాప్ గ్రూప్‌లో వచ్చిన మెసేజ్‌లు ఈ దారుణాన్ని వెలుగులోకి తెచ్చాయి. ముఖ్యంగా వైవా సమయంలో సదరు ప్రొఫెసర్ నుంచి తనకు ఎదురైన చేదు అనుభవాన్ని ఒక విద్యార్థిని ఆ గ్రూప్‌లో పంచుకుంది. ఈ సమాచారాన్ని చూసిన మరికొందరు విద్యార్థినులు ధైర్యం తెచ్చుకుని.. తమకు కూడా అదే ప్రొఫెసర్ నుంచి అలాంటి అనుభవాలే ఎదురయ్యాయని బయటకు చెప్పారు. వైవా సమయంలో ప్రొఫెసర్ లైంగిక ధ్వని ఉన్న వ్యాఖ్యలు చేయడమే కాకుండా, తనతో గడిపితే అదనపు మార్కులు వేస్తానని ఆశ చూపినట్లు విద్యార్థినులు ఆరోపించారు.కేవలం వైవా పరీక్షల సమయంలోనే కాకుండా.. జేఎన్‌యూ క్యాంపస్‌లో తన అధికారిక నివాసంలో నిర్వహించే సమావేశాలకు విద్యార్థినులను ఆహ్వానించి, అక్కడ కూడా లైంగికంగా వేధించేవాడని బాధితురాళ్లు ఆరోపిస్తున్నారు. తరగతి గదుల్లో పాఠాలు చెప్పే సమయంలోనూ అసభ్యకరమైన, అనుచితమైన కామెంట్లు చేసేవాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. మే నెలలో ఫిర్యాదు నమోదు కాగానే విశ్వవిద్యాలయానికి దాదాపు 45 రోజుల పాటు సెమిస్టర్ సెలవులు వచ్చాయి.

తిరిగి తరగతులు ప్రారంభమయ్యాక ఈ వ్యవహారం క్యాంపస్‌లో మళ్లీ తీవ్ర చర్చనీయాంశమైంది.ఈ క్రమంలోనే సీనియర్ విద్యార్థినులు సహా మరికొందరు ముందుకు వచ్చి ఆ ప్రొఫెసర్‌పై మరిన్ని ఫిర్యాదులు చేశారు. అయితే ప్రస్తుతం ఇది అంతర్గత విచారణలో ఉన్నందున ఏ వ్యాఖ్య చేయలేమని ఐసీసీ తెలిపగా.. జేఎన్‌యూ యాజమాన్యం కూడా ఇప్పటి వరకు దీనిపై అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. గతంలో కూడా జపాన్ రాయబార కార్యాలయ మహిళా అధికారితో అసభ్యకరంగా ప్రవర్తించిన స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ స్టడీస్ సీనియర్ ప్రొఫెసర్ స్వరణ్ సింగ్‌ను ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఉద్యోగం నుంచి తొలగించిన ఉదంతాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటున్నారు.

అడ్డంగా బుక్కైన ఫోక్ సింగర్..!



హైదరాబాద్: గత వారం పది రోజుల నుండి ఎక్కడ చూసినా మనకు కనిపిస్తూ , వినిపిస్తున్న పేర్లు మాధురి రాథోడ్ , ఈశ్వర్ సాయి. గత కొంత కాలం నుండి రిలేషన్ లో ఉంటున్న వీళ్లిద్దరు , ఒకే రూమ్ లో ఉన్నప్పుడు , ఈశ్వర్ సాయి సతీమణి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకోవడం, ఆ తర్వాత ఆమె వీడియోలు రికార్డు చేసి సోషల్ మీడియా లో అప్లోడ్ చేయడం తో అవి సంచలనంగా మారడం వంటివి జరిగాయి. అనంతరం ఈశ్వర్ సాయి , మాధురి రాథోడ్ లకు సంబంధించిన ఎన్నో ఆడియో రికార్డ్స్ సోషల్ మీడియా లో లీక్ అయ్యాయి. ఇదంతా పక్కన పెడితే రీసెంట్ గానే మాధురి రాథోడ్ , తీవ్రమైన మనస్తాపానికి గురై,నార్సింగి పోలీస్ స్టేషన్ లో ఈశ్వర్ సాయి పై ఫిర్యాదు చేసింది. తనని పెళ్లి చేసుకుంటానని మోసం చేసి , శారీరకంగా వాడుకొని , ఇప్పుడు వదిలేశాడని,అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఆమె కోరింది. పోలీసులు కేసు నమోదు చేసి , దర్యాప్తు చేయగా , ఈశ్వర్ సాయి పరారీ లో ఉన్నట్టు తెలిసింది. అయితే పోలీసులు అతని పై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని , తన పరువు మొత్తాన్ని బజారుకి ఈడ్చారని ఆవేదన వ్యక్తం చేస్తూ మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమె ఫ్యాన్ కి ఉరేసుకొని వేలాడుతుండడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు , వెంటనే తలుపులు బద్దలు కొట్టి , లోపలకు చొరబడి మాధురి ప్రాణాలను కాపాడారు. ఒకవేళ వాళ్ళు కాస్త ఆలస్యం చేసి ఉన్నా ఈరోజు మాధురి రాథోడ్ మన మధ్య ఉండేది కాదు. అయితే ఆత్మహత్యాయత్నం చేసుకునే ముందు మాధురి రాథోడ్ రాసిన చివరి లేఖ , ఇప్పుడు సోషల్ మీడియా లో సంచలనం గా మారింది.ఆ లేఖలో ఏముందంటే 'ముందుగా నా కుటుంబానికి మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్తున్నాను. నాకు బ్రతకాలని లేదు.

నాకే ఎందుకు ఇలా జరుగుతుందో అర్థం కావడం లేదు, నేను ఎవరికీ ఎలాంటి హాని తలపెట్టలేదు. నాకు భవిష్యత్తు లేదు , అంతా అయిపోయింది. ఇలాంటి సమయం లో కూడా నా కుటుంబ సభ్యులు నాకు ఎంతో అండగా నిలిచారు. నా అభిమానులు కూడా చాలా సపోర్ట్ గా నిలిచారు. అందుకు ధన్యవాదాలు. మీకు ఎప్పటికీ రుణపడి ఉంటాను , నేను చాలా పెద్ద తప్పు చేశాను, అందుకే దానికి శిక్ష గా చనిపోవాలని అనుకుంటున్నాను. ఇక నేను సమాజం లో ఎవరినీ ఫేస్ చెయ్యలేను, నా క్యారెక్టర్ పోయింది, ఇక బ్రతకాలని ఆశ చచ్చిపోయింది. నేను ఇక వెళ్ళిపోతున్నాను. నా చావుకు కారణం ఈశ్వర్ , శరణ్య , సంధ్య మరియు సోషల్ మీడియా ట్రోల్స్' అంటూ మాధురి రాథోడ్ ఆ లేఖలో చెప్పుకొచ్చింది.

పట్టాలపై నడిచే ఫైవ్ స్టార్ హోటల్



హైదరాబాద్: మనదేశంలో అత్యంత చవకైన రవాణా వ్యవస్థగా రైల్వే శాఖకు పేరు ఉంది. ఆంగ్లేయుల కాలం నుంచి మనదేశంలో రైల్వే వ్యవస్థ ఏర్పాటు అయింది. అప్పటినుంచి దినదిన ప్రవర్ధమానంగా ఎదుగుతుంది. ప్రతి ఏడాది ప్రయాణికులు పెరుగుతూ ఉండడం.. ప్రయాణికులు ప్రీమియం సౌకర్యాలు కోరుకుంటున్న నేపథ్యంలో.. రైల్వే శాఖ వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టింది. మొన్నటిదాకా వందే భారత్ రైళ్లలో స్లీపర్ కోచ్ లు అందుబాటులో ఉండేవి కాదు. ప్రయాణికుల నుంచి విజ్ఞప్తులు పెరిగిపోవడంతో రైల్వే శాఖ భారీగా వెచ్చించి.. సుదూర రాత్రి ప్రయాణాల కోసం వందే భారత్ స్లీపర్ కోచ్ లు అందుబాటులోకి తీసుకొచ్చింది. కొత్త వెర్షన్లో ప్రయాణికులకు అత్యద్భుతమైన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చేసాయి. ఒక రకంగా స్లీపర్ కోచ్ లను పట్టాల మీద నడిచే ఫైవ్ స్టార్ హోటల్ అని చెప్పవచ్చు.వందే భారత్ స్లీపర్ కోచ్ కు సంబంధించి ఒక వీడియో సోషల్ మీడియాలో బయటికి వచ్చింది. అందులో ఉన్న సౌకర్యాలు చూసి చాలామంది ఆశ్చర్యపోతున్నారు. ఇది ఒక లగ్జరీ హోటల్ లాగా ఉందని.. అద్భుతమైన సౌకర్యాలు ఇందులో ఉన్నాయని వ్యాఖ్యానిస్తున్నారు . ఆ వీడియోలో ఉన్న దృశ్యాలను చూస్తుంటే ప్రయాణికుల కోసం ప్రత్యేకమైన.. ప్రైవేట్ క్యాబిన్ ఉంది. అందులో లైటింగ్.. ప్రీమియం ఫినిషింగ్.. విశాలవంతమైన స్థలం అద్భుతంగా ఉన్నాయి.ప్రస్తుతం వందే భారత్ రైళ్లల్లో చైర్ కార్ ఏర్పాట్లు మాత్రమే ఉన్నాయి. కొత్తగా స్లీపర్ వెర్షన్ అందుబాటులోకి వచ్చింది. ప్రయాణికులకు ఈ కోచ్ అత్యంత సుఖవంతమైన నిద్ర వసతి అందిస్తుంది. అంతేకాదు ఫస్ట్ ఏసీ కోచ్ లలో విశాలవంతమైన స్థలాన్ని ఏర్పాటు చేశారు. క్యాబిన్ క్రమబద్ధంగా.. సౌకర్యవంతంగా ఉంది.

మెట్రోలకు కొత్త సిగ్నలింగ్... కొత్త కోచ్‌లు..!



హైదరాబాద్, : హైదరాబాద్ మెట్రో రైలు వ్యవస్థలో కొత్త కోచ్‌లను ప్రవేశపెట్టే ప్రక్రియలో కీలక సాంకేతిక అంశం తెరపైకి వచ్చింది. ప్రస్తుతం ఉన్న పాత రోలింగ్ స్టాక్‌తో కొత్త కోచ్‌లను అనుసంధానం చేయాలంటే.. కొత్త కోచ్‌లను పాత సిగ్నలింగ్ వ్యవస్థకు అనుగుణంగా తయారు చేయాలా? లేక ఇప్పటికే ఉన్న సిగ్నలింగ్, ట్రైన్ కంట్రోల్ వ్యవస్థనే ఆధునికీకరించాలా? అనే అంశంపై చర్చ జరుగుతోంది. రెండో మార్గమే మెరుగైనదని దిల్లీ మెట్రో రైలు కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) సూచించినట్లు సమాచారం.ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన డీఎంఆర్‌సీ ఇంజినీర్లు కొత్త మెట్రో కోచ్‌ల కొనుగోలు అంశంపై హైదరాబాద్ మెట్రో రైలు అధికారులతో ప్రాథమికంగా చర్చించారు. పాత సాంకేతికతకు అనుగుణంగా కొత్త రైళ్లను ప్రత్యేకంగా రూపొందించడం కంటే.. మొత్తం సిగ్నలింగ్, ట్రైన్ కంట్రోల్ వ్యవస్థను ఆధునికీకరిస్తే భవిష్యత్తులో కొత్త కోచ్‌లను సమీకరించడం సులభమవుతుందని సూచించినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ మెట్రోలో ప్రస్తుతం 57 ట్రైన్ సెట్లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో రైలులో మూడు కోచ్‌లు ఉంటాయి. ఉదయం, సాయంత్రం కార్యాలయాల రద్దీ వేళల్లో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరుగుతుండటంతో ప్రస్తుతం ఉన్న రైళ్లు సరిపోవడం లేదని అధికారులు గుర్తించారు. రద్దీని తగ్గించడంతో పాటు ప్రయాణికులకు మెరుగైన తీసుకుంది.ఇందులో భాగంగా 60 కొత్త కోచ్‌లు, అంటే 10 కొత్త మూడు కోచ్‌ల ట్రైన్ సెట్లను కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. వీటి సమీకరణకు సంబంధించిన ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. అయితే కొత్త కోచ్‌లను ప్రస్తుత వ్యవస్థతో అనుసంధానం చేసే విషయంలోనే సాంకేతిక సవాలు ఎదురవుతోంది. హైదరాబాద్ మెట్రో మొదటి దశలో కొనుగోలు చేసిన రోలింగ్ స్టాక్ ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్, ఆటోమేటిక్ ట్రైన్ ఆపరేషన్, కమ్యూనికేషన్ బేస్డ్ ట్రైన్ కంట్రోల్ వంటి సాంకేతిక వ్యవస్థలకు అనుగుణంగా రూపొందించారు.

కేసీఆర్ రాజీనామా చుట్టూ రాజకీయాలు!



మెదక్, : తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాజీనామా డిమాండ్ చుట్టూ భగ్గుమంటున్నాయి. అసెంబ్లీ సమావేశాలకు గైర్హాజరవుతున్న కేసీఆర్.. ఎమ్మెల్యే పదవిలో కొనసాగే నైతిక హక్కును కోల్పోయారని అధికార కాంగ్రెస్ ముప్పేట దాడి చేస్తుంటే, బీఆర్ఎస్ అంతే దీటుగా ప్రతిదాడికి దిగుతోంది. ఒకవైపు శాసనసభ సంప్రదాయాలు, నైతిక బాధ్యతల పేరిట కాంగ్రెస్ ఒత్తిడి పెంచుతుంటే, మరోవైపు దీనిని రాజకీయ ప్రతీకారంగా అభివర్ణిస్తూ బీఆర్ఎస్ సెంటిమెంట్ అస్త్రాన్ని ప్రయోగిస్తోంది. మొత్తంగా కేసీఆర్ హాజరు అంశం రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త రణరంగాన్ని సృష్టించింది.ప్రజాప్రతినిధిగా ఎన్నికైన వ్యక్తి సభకు రాకుండా తప్పించుకోవడం ప్రజాస్వామ్యానికే అవమానమని కాంగ్రెస్ నేతలు వాదిస్తున్నారు. ప్రజల సమస్యలను చట్టసభలో లేవనెత్తాల్సిన బాధ్యతను విస్మరిస్తూ, ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్‌కు ఎమ్మెల్యేగా కొనసాగే అర్హత లేదని అధికార పక్షం తేల్చి చెబుతోంది. అసెంబ్లీ గేటు తొక్కకుండా ప్రజాధనంతో వచ్చే జీతభత్యాలు, సదుపాయాలు అనుభవించడం సిగ్గుచేటని మంత్రులు నేరుగా విమర్శలు గుప్పిస్తున్నారు. పదేళ్లపాటు సీఎంగా పనిచేసిన వ్యక్తికి అసెంబ్లీలో కూర్చోవడానికి అహం అడ్డొస్తోందా అని కాంగ్రెస్ నిలదీస్తోంది. ప్రతిపక్ష నేత హోదా దక్కించుకుని కూడా సభలో ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో విఫలమయ్యారని, ప్రజా సమస్యలపై మాట్లాడే దమ్ము లేకపోతే వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తోంది.కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా ఖండిస్తున్నాయి. కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడం వెనుక ఉన్న కారణాలను రాజకీయంగా, భావోద్వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాయి.

ట్రాన్స్ జెండర్ల ఆగడాలకు చెక్



హైదరాబాద్, : హైదరాబాద్ నగరంలో శుభకార్యాలు జరుగుతున్న ఇళ్లపై కొందరు ట్రాన్స్‌జెండర్ల పేరుతో చేస్తున్న దాడిపై తెలంగాణ పోలీసులు అప్రమత్తమయ్యారు. అక్రమ వసూళ్లు , బెదిరింపుల దందాపై తెలంగాణ పోలీస్ శాఖ తీవ్రంగా స్పందించింది. ఇటీవల చింతల్ ప్రాంతంలో జరిగిన ఒక గృహప్రవేశ కార్యక్రమంలో రూ.50,000 నగదు డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులను ఇంట్లోకి వెళ్లకుండా అడ్డుకున్న ఘటన కలకలం రేపింది. ఈ క్రమంలో బాధితులపట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, శాపనార్థాలు పెట్టడం పై తీసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంపై తెల ంగాణ డీజీపీ సీవీఆనంద్ తీవ్ర ఆగ్రహంవ్యక్తం చేశారు. ఇటువం టి బలవం తపు వసూళ్లపై రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక పోలీస్ డ్రైవ్ నిర్వహించాలని ఆయన పోలీసు కమిషనర్లను ఆదేశించారు. చింత ల్‌లోని తమ నూతన గృహంలోకి అడుగుపెడుతున్న ఒక కుటుంబా న్ని కొందరు ట్రాన్స్‌జెండర్లు అడ్డుకున్నారు. అంత పెద్ద మొత్తంలో డబ్బులు ఇచ్చుకోలేమని ఆ కుటుంబం వేడుకున్నప్పటికీ, వారు వినిపించుకోకుండా తీవ్రపదజాలంతో దూషించారు. సామాజిక మాధ్యమాల్లో బాధితులు పంచుకున్న ఈ వీడియో వైరల్ కావడంతో పోలీసుల రక్షణ పై ప్రశ్నలు రేకెత్తించింది. పోలీసు చర్యలు కేవలం అక్రమ దందాలు, బెదిరింపులకు పాల్పడే నేరపూరిత మూకల పైనే ఉంటాయని, ఇవి మొత్తం ట్రాన్స్‌జెండర్ సమాజానికి వ్యతిరేకం కాదని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటికే ట్రాన్స్‌జెండర్ల జీవనోపాధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని గుర్తుచేశారు.

ఫించన్ల పండుగకు బృహత్తర అడుగు



ఒంగోలు : ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి మరో బృహత్తర అడుగు వేసింది. ఇప్పటికే ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా దేశంలోనే అత్యధికంగా 62 లక్షల మందికి ప్రతి నెలా ఒకటో తేదీనే సామాజిక భద్రత పింఛన్లు అందిస్తూ పేదల పండుగ ను నిర్వహిస్తున్న ప్రభుత్వం, తాజాగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకాన్ని విస్తరించాలని నిర్ణయించింది. సాంకేతిక , ఇతర కారణాల వల్ల ఇప్పటివరకు పింఛను అందుకోలేకపోయిన పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు , ఇతర వృత్తుల వారికోసం కొత్త దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో అందుబాటులో ఉండే నిర్దేశిత ఫారాల ద్వారా అర్హులందరూ తమ పత్రాలను సమర్పించవచ్చని అధికార యంత్రాంగం వెల్లడించింది.అర్హుల ఎంపికలో ఎలాంటి జాప్యానికి, అవకతవకలకు తావులేకుండా ప్రభుత్వం అత్యంత పారదర్శకమైన, స్పష్టమైన సమయ పట్టికను ఖరారు చేసింది. ఈ-కేవైసీ, ఆన్‌లైన్ నమోదు పూర్తయ్యాక, సాధారణ అర్హత పరిశీలన చేపడతారు. అనంతరం భౌతిక , శాఖాపరమైన క్షేత్రస్థాయి ధృవీకరణ పూర్తి చేసి, సెర్ప్ ద్వారా బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వ ఆమోదానికి పంపుతారు. ఈ ప్రక్రియ ముగిశాక అర్హులైన అందరికీ దశలవారీగా కొత్త పింఛన్లను మంజూరు చేయనున్నారు. వివిధ కేటగిరీలకు అవసరమైన ఆధార్, రైస్ కార్డ్, సదరమ్ , ఆయా సంబంధిత శాఖల ధృవపత్రాలను జతచేసి అక్నాలెడ్జ్‌మెంట్ పొందే సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చారు.ప్రస్తుతం ప్రతి నెలా రూ.2,694 కోట్ల వ్యయంతో జనాభాలో 12.88 శాతం మందికి నెలకు రూ.4,000 నుంచి గరిష్టంగా రూ.15,000 వరకు భరోసా అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 2026 సెప్టెంబర్ 1 వరకు కేవలం పింఛన్ల కోసమే ఏకంగా రూ.73,508 కోట్లు ఖర్చు చేయడం, సంక్షేమం పట్ల ప్రభుత్వానికున్న చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలుస్తోంది. వృద్ధులు, దివ్యాంగులతో పాటు చేనేత, మత్స్యకార, కల్లుగీత కార్మికులు, ట్రాన్స్‌జెండర్లు, ఒంటరి మహిళలు సహా దాదాపు 28 రకాల ప్రత్యేక కేటగిరీలకు పింఛన్లు ఇస్తూ ఆర్థిక వెసులుబాటు కల్పిస్తున్నారు.గతంలో పింఛను పొందాలంటే సచివాలయాల చుట్టూ తిరగాల్సి రావడం, ఊహాజనిత కారణాలతో కోతలు విధించడం వంటి పరిణామాలు ఉండేవి. అయితే, ప్రస్తుత ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రమాణంగా ముందుకు సాగుతోంది. కొత్త దరఖాస్తుల స్వీకరణ ద్వారా క్షేత్రస్థాయిలో అసలైన నిరుపేదలకు, బాధితులకు 100 శాతం సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా పెట్టుకుంది. కొత్త ఫించన్ల కోసం ఎదురుచూస్తున్న వారికి ఏపీ సర్కార్ శుభవార్త చెప్పింది. ఎన్టీఆర్ భరోసా పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు ఫించన్లు అందించేందు సిద్ధమైంది. ఈమేరకు ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలను ప్రకటించింది. నేటి నుంచి వారం రోజుల పాటు గ్రామ వార్డు, సచివాలయాల్లో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను తీసుకోనుంది. మీ ఈ ఫించన్ ఎవరికి వస్తుంది. దీనికి అర్హులు ఎవరి, ఎలా దరఖాస్తు చేసుకోవాలి, దరఖాస్తు చేయడానికి ఏం ఏం పత్రాలు కావాలో ఇక్కడ తెలుసుకుందాం.కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. నేటి నుంచి వారం రోజుల పాటు కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు తీసుకుంటున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. గత ప్రభుత్వంలో జారీ చేసిన జీవో 174 ప్రకారమే లబ్ధిదారుల అర్హతను గుర్తించనున్నట్టు ప్రభుత్వం తెలిపింది. లబ్ధిదారుల నుంచి వచ్చిన దరఖాస్తున్నలు పూర్తిగా పరిశీలించి అర్హులైన వారికి కేటగిరీల వారీగా ఫించన్లు పంపిణీ చేయనున్నట్టు తెలిపింది. ఈ దరఖాస్తు ప్రక్రియను నేటి నుంచి స్టార్ట్ చేసి 20 రోజుల్లో పూర్తి చేయనున్నారు. ఆ తర్వాత అర్హులైన వారికి వచ్చే నెల ఒకటి నుంచి ఫించన్లు అందించనున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ దరఖాస్తు ప్రక్రియ కొనసాగనున్నట్టు అధికారులు తెలిపారు. అలాగే ఔఉూచి వెబ్‌సైట్, ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు తమ దరఖాస్తు పత్రాన్ని సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్, వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శికి ఇవ్వాలి.. అతను మీ అప్లికేషన్‌లో అన్‌లైన్‌లో ఎంట్రీ చేసి తర్వాత మీరు మళ్లీ ఓ రసీదు ఇస్తారు. తర్వాత మీ అప్లికేషన్లోని వివరాలను ఈకేవైసీ డేటాతో మ్యాచ్ అయితే మీ అప్లికేషన్ తర్వాత దశకు వెళ్తోంది. అలేదంటే మీ దరఖాస్తున్న ఉన్న సమస్యను తెలియజేసి సరైన డాక్యుమెంట్స్‌ను మళ్లీ సబ్‌మిట్ చేయాలని చెప్తారు. మీరు ఫించన్‌ను అప్ప చేయాలంటే కావాల్సిన పత్రాలు ఆధార్, రేషన్ కార్డు, ఇన్‌కమ్ సర్టిఫికెట్ వితంతు ఫించన్ కోసమైతే.. లబ్ధిదారు భర్త డెత్ సర్టిఫికెట్, భర్త ఆధార్ కార్డు ఉండాలి ఒంటరి మహిళ పింఛను కోసమైతే పెళ్లైన వారికి కోర్టు జారీ చేసి విడాకుల పత్రం ఉండాలి, పెళ్లికాని వారికి మ్యారేజ్ అవ్వనట్టు ఓఖీూ జారీ చేసిన ధ్రువీకరణ పత్రం కావాలి. దివ్యాంగుల పింఛను కోసం అయితే.. 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న సదరమ్ సర్టిఫికెట్ కావాలి.హిజ్రాల పింఛన్ కోసం జిల్లా మెడికల్ బోర్డు జారీ చేసిన ధ్రువీకరణ పత్రం అవసరం

విజయసాయిరెడ్డి సస్పెన్స్



విజయవాడ, : విజయసాయిరెడ్డి.. దసరా దాకా సస్పెన్స్ థ్రిల్లర్.. అప్పుడే రిలీజ్..చెప్పిన సమయానికి.. అనుకున్న వేదిక వద్దకు విజయసాయిరెడ్డి వచ్చారు. కొద్దిరోజులుగా ఆయన సోషల్ మీడియాలో పెడుతున్న పోస్టులకు తగ్గట్టుగానే.. సుదీర్ఘంగా మాట్లాడారు. వచ్చిన విలేకరులకు తాగడానికి అల్లం టీ.. స్నాక్స్.. మంచి భోజనం పెట్టారు. కానీ.. తన స్క్రిప్ట్ ప్రకారం సస్పెన్స్ థ్రిల్లర్ కొనసాగించారు.సుదీర్ఘంగా మాట్లాడిన విజయసాయిరెడ్డి పార్టీ గురించి ఎటువంటి ప్రకటన చేయలేదు. కాకపోతే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఇప్పటివరకు రెడ్లు.. కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు మాత్రమే పరిపాలించారని చెప్పారు. అంతేకాదు, తాను ఏర్పాటు చేయబోయే రాజకీయ పార్టీలో సింహభాగం స్థానాలు జన్ జెడ్ కు కేటాయిస్తామని చెప్పారు. అక్కడితోనే ఆగిపోలేదు.. దసరాకు తాను ఏర్పాటు చేయబోయే పార్టీ గురించి ప్రకటిస్తానని విజయసాయిరెడ్డి వెల్లడించారు. అంతేకాదు.. తాను ఏర్పాటు చేయబోయే పార్టీ అధికారంలోకి గనుక వస్తే.. తాను ముఖ్యమంత్రి పదవి తీసుకోనని.. మహారాష్ట్రలో శివసేన అధినేత బాల్ థాక్రే మాదిరిగా పాత్ర పోషిస్తానని చెప్పుకొచ్చారు.విజయసాయిరెడ్డి జగన్ నుంచి దూరం జరిగిన తర్వాత ప్రజాస్వామ్య యుతంగా మాట్లాడుతున్నారు. గడిచిన ఏడాదికాలంగా ఆయన పరిశోధన చేశారట. కాపు కులం నుంచి రెడ్లు ఏ విధంగా వేరుపడ్డారు.. దానికి దారి తీసిన పరిస్థితుల గురించి ఒక పుస్తకాన్ని రాశారట. ఏపీ రాష్ట్రాన్ని ఇప్పటివరకు రెడ్లు.. కమ్మ సామాజిక వర్గాలకు చెందిన వారు మాత్రమే పరిపాలించారని.. మిగతా సామాజిక వర్గాలు ఎందుకు పరిపాలించకూడదని ప్రశ్నించడం విజయసాయిరెడ్డి.. కేవలం రెడ్ల గురించి మాత్రమే పరిశోధన చేయడమేంటి.. పుస్తకం రాయడం ఏంటి.. పైగా పార్టీని ఏర్పాటు చేయబోతున్న ఈ సమయంలో దాని ప్రస్తావన ఎందుకుఆంధ్ర రాష్ట్రానికి దాదాపు 1500 టీఎంసీల నీళ్లు అవసరమని.. ప్రస్తుతం 1100 టిఎంసిల నీళ్లు మాత్రమే ఉన్నాయని విజయసాయిరెడ్డి చెప్పారు. ఆయన ఆవేదనలో అర్థం ఉంది. కానీ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నెంబర్ 2 స్థానంలో ఉన్న విజయసాయిరెడ్డి ఏం చేశారు.. అప్పట్లో పార్టీని సజ్జల రామకృష్ణారెడ్డి హైజాక్ చేయలేదు కదా. అప్పుడు విజయసాయిరెడ్డి ఎంత చెబితే జగన్ కు అంత కదా.. అప్పుడు విజయసాయి రెడ్డి ఏం చేశారు.. ఇప్పుడు ప్రాధాన్యం తగ్గింది.. అందువల్లే ఏపీ ప్రయోజనాలు విజయ సాయి రెడ్డికి గుర్తుకు వచ్చాయి. దసరా దాకా పార్టీ ఏర్పాటును విజయసాయిరెడ్డి సస్పెన్స్ లో పెట్టారు.. కానీ ఇప్పటికీ ఏపీలో పరిస్థితి టిడిపి కూటమి వర్సెస్ వైఎస్ఆర్సిపి అన్నట్టుగానే ఉంది. అప్పట్లో షర్మిల పార్టీ పెట్టినప్పటికీ పెద్దగా సత్తా చూపించిన దాఖలాలు లేవు. విజయసాయిరెడ్డి చెప్పినట్టుగా వచ్చే ఎన్నికల్లో రాజకీయ శూన్యత.. రాజకీయ అనివార్యత ఏపీ రాష్ట్ర రాజకీయాలలో కనిపిస్తుంది అంటే.. నమ్మశక్యంగా లేదు.

ఇదే స్ఫూర్తితో ఇంకా దాతలు ముందుకు రావాలి : జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్

అనంతపురం: జిల్లాలోని కంబదూరు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బాలల బీమా ప్రీమియం రూ.5 లు చొప్పున 4974 మంది విద్యార్థులకు రూ.24,870 లను మంగళవారం అనంతపురం వార్త విలేకరి బి.మల్లేసు బాలల బీమా అకౌంటు (జాయింట్ కలెక్టర్ ఁ అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సమగ్రశిక్ష అనంతపురం) లో జమ చేశారు. జమ చేసిన రసీదుని గౌరవ జిల్లా కలెక్టర్ శ్రీ ఓ. ఆనంద్ గారికి కలిసి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వార్త విలేఖరి బి. మల్లేసు ను అభినందించారు. విలేఖరి తన సొంత ఊరు కంబదూరు మండలం వైసిపల్లి కావడంతో ఆ మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుండి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అందరికీ రూ.5 చొప్పున బాలల బీమా ప్రీమియం మండలంలోని అందరు విద్యార్థులకు చెల్లించడం చాలా అభినందించాల్సిన విషయం అన్నారు. అదేవిధంగా విలేఖరి గతంలో ప్రభుత్వ హాస్టల్స్ విద్యార్థులకు కూడా నోట్ పుస్తకాలు, జామెంట్రీ బాక్స్ లు కూడా అందజేశారని గుర్తుచేశారు. ఈ ప్రీమియం ద్వారా ప్రమాదవశత్తు విద్యార్థులు మృతి చెందుతే ఆ విద్యార్థికి రూ.25 వేల రూపాయలను, గాయపడిన వారికి రూ.10 వేలు అందజేయడం జరుగుతుందన్నారు. ఇదే స్ఫూర్తితో మరికొందరు దాతలు కూడా ముందుకు రావాలని కోరారు. ఆ విధంగా విద్యాశాఖ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా ఈ బీమాను సాధారణ మరణాలకు కూడా వర్తింపు చెయ్యాలని, అదేవిధంగా బీమా ప్రీమియంను రూ.5 రూపాయల నుండి రూ.10 రూపాయలకు పెంచి బీమా ను రూ.25 వేలు నుండి రూ.50 వేలకు పెంచాలని దాత అయినటువంటి వార్త విలేకరి జిల్లా కలెక్టర్ ను కోరడం జరిగింది. ఇందుకు జిల్లా కలెక్టర్ కూడా సానుకూలంగా స్పందించారు. అదేవిధంగా వార్త విలేకరిని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్.ఎన్. అయూబ్ హుస్సేన్, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ కూడా అభినందించారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఇన్ ఛార్జ్ ఐఈడి కోఆర్డినేటర్ ఫణిరాజు, కంబదూరు ఎంఈఓ-1 ఉమాపతి పాల్గొన్నారు.

రెండేళ్ల పాలనకు రెఫరెండమేనా



విజయవాడ, : ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలు శరవేగంగా సాగుతుండటంతో, ఈ ఎన్నికల ఫలితాలు కూటమి ప్రభుత్వం సాధించిన రెండేళ్ల పాలనకు రెఫరెండం అవుతాయా అనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. సర్వే ఏజెన్సీలు ఇచ్చే ప్రైవేటు సర్వేలు, ఒపీనియన్ పోల్స్ ఎన్ని వచ్చినా.. గ్రామ , నగర స్థాయిలో ఓటర్లు నేరుగా తమ ఓటు హక్కును వినియోగించుకునే ఈ ఎన్నికలే అసలైన ప్రజాభిప్రాయానికి నిలువెత్తు అద్దమని నమ్మడంలో సందేహం లేదు. అయితే, ఈ ఎన్నికలను బహిరంగంగా రెఫరెండం గా అంగీకరించేందుకు రాజకీయ పార్టీలు, ముఖ్యంగా అధికార పక్షం ముందుకు వస్తుందా లేదా అనేది అసలైన ప్రశ్న.సాధారణంగా ఏ రాష్ట్రంలోనైనా అధికారంలో ఉన్న పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికలను తమ ప్రభుత్వ పాలనపై రెఫరెండం అని అధికారికంగా ప్రకటించడానికి ఇష్టపడవు. స్థానిక ఎన్నికల్లో కేవలం రాష్ట్రస్థాయి విధానాలు లేదా సంక్షేమ పథకాలే కాకుండా, స్థానిక అభ్యర్థి ఇమేజ్, కుల సమీకరణాలు, వ్యక్తిగత సంబంధాలు, ధనప్రవాహం వంటి అనేక హైపర్-లోకల్ అంశాలు ప్రభావం చూపుతాయి. ప్రభుత్వంపై ఎంత పాజిటివ్ వేవ్ ఉన్నప్పటికీ, స్థానికంగా ఎంపీటీసీ, సర్పంచ్ , కార్పొరేటర్ అభ్యర్థులపై ఉండే అసంతృప్తి వల్ల కూడా కొన్ని స్థానాలు చేజారే ప్రమాదం ఉంటుంది. అందుకే, అధికార కూటమి ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేసినప్పటికీ, దీనికి రెఫరెండం ముద్ర వేసి అనవసర రాజకీయ ప్రమాదాన్ని కొనితెచ్చుకోదు.మరోవైపు, ప్రైవేటు సర్వేల ను పక్కన పెడితే.. స్థానిక పోరులో వచ్చే ఫలితాలే అసలైన గ్రౌండ్ రియాలిటీని సూచిస్తాయి. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన సంచలనాత్మక తీర్పు తర్వాత, కూటమి అమలు చేస్తున్న సూపర్ సిక్స్ హామీలు, పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాలు , అమరావతి అభివృద్ధి వంటి పరిణామాలు ప్రజల్లో ఎంతవరకు సానుకూలతను నింపాయో ఈ ఎన్నికల ద్వారా స్పష్టమవుతుంది. గ్రామీణ ,పట్టణ ఓటర్లు కూటమి పాలన పట్ల సంతృప్తిగా ఉన్నారా లేదా అనేది బ్యాలెట్ బాక్సుల ద్వారా నిరూపితమవుతుంది. ఇక ప్రతిపక్ష వైఎస్ఆర్సీపీ ఈ రెఫరెండం వాదనను ఒక రాజకీయ ఆయుధంగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తోంది. కూటమి ప్రభుత్వ వైఫల్యాలకు, హామీల నెరవేర్పులో జరుగుతున్న జాప్యానికి ఈ ఎన్నికలే కొలమానం అని ప్రచారం చేయడం ద్వారా ఓటర్లను తమవైపు తిప్పుకోవచ్చని భావిస్తోంది. అయితే, జగన్ పార్టీ నిజంగా ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, అధికార పార్టీకి కౌంటర్ ఇవ్వాలంటే కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, ప్రతీ స్థానంలోనూ గట్టి పోటీని ఇచ్చి ఓటర్లలో నమ్మకాన్ని పునరుద్ధరించాల్సి ఉంటుంది. ఇక అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పరంగా చూస్తే, ఈ ఎన్నికలు కేవలం గెలుపోటములకే పరిమితం కాకుండా, మిత్రపక్షాల మధ్య సమన్వయం ఎంతవరకు బలపడిందో తేల్చే వేదికగా మారనున్నాయి. క్షేత్రస్థాయిలో వార్డులు, పంచాయతీల స్థాయిలో టిక్కెట్ల కేటాయింపులో పార్టీల మధ్య ఘర్షణలు రాకుండా చూసుకోవడం కూటమి పెద్దలకు సవాలుగా మారనుంది.కూటమి నేతలు స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు జరిపి భారీ విజయాన్ని సాధిస్తే, అది వైఎస్ఆర్సీపీ నైతిక ధైర్యాన్ని దెబ్బతీయడమే కాకుండా, కూటమి పాలనకు ప్రజల ఆమోదముద్ర పడినట్లే అవుతుంది. సాంకేతికంగా లేదా అధికారికంగా ఏ పార్టీకూడా ఈ స్థానిక పోరును పాలనా రెఫరెండం అని ఒప్పుకోకపోయినా, రాజకీయ విశ్లేషకుల దృష్టిలో మరియు ప్రజల ఆలోచనల్లో ఇది కచ్చితంగా కూటమి ప్రభుత్వ పనితీరుకు వేసే గ్రేడింగ్ మార్కులే. ఈ ఎన్నికల ఫలితాలు రాబోయే 2029 సార్వత్రిక ఎన్నికలకు స్పష్టమైన పొలిటికల్ రోడ్‌మ్యాప్‌ను, మూడ్‌ను నిర్దేశిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు

మూడు మేయర్ సీట్లపై కమలం పార్టీకి పట్టు..!



విశాఖపట్టణం, : ఇటు టీడీపీ. ఇటు జనసేన. కూటమిలోని ఈ రెండు పార్టీలు.. స్థానిక ఎన్నికలపై ఎవరి లెక్కల్లో వారు బిజీగా ఉన్నారు. బీజేపీ కూడా సైలెంట్‌గా ఉంటూనే పకడ్బందీ ప్లానింగ్స్ చేస్తోందట. కార్పొరేషన్ ఎన్నికల్లో డైరెక్ట్ ఫైట్‌ను దృష్టిలో పెట్టుకొని వ్యూహాలకు పదును పెడుతోందట కమలం పార్టీ. విశాఖ మేయర్ పీఠంపై బీజేపీ స్పెషల్ ఫోకస్ పెట్టిందట. ఏపీ నగర పాలక సంస్థల్లో గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ అతిపెద్దది. 125 డివిజన్ల డీలిమిటేషన్ ప్రాసెస్ కూడా జరగబోతోంది. విశాఖ జిల్లాతో పాటు అనకాపల్లి జిల్లాలో విస్తరించి ఉంది. అందుకే ఇక్కడ మేయర్ పీఠం అంటే దాదాపు క్యాబినెట్ మంత్రితో సమానం అన్నట్లుగా భావిస్తున్నారు.ఆంధ్ర ప్రదేశ్ వార్షులుఏడాదికి ఐదారు వేల కోట్ల బడ్జెట్ ఉండే గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పీఠం అంటే చాలా పెద్ద పదవి అనే చెప్పొచ్చు. ప్రత్యక్ష ఎన్నికలు జరగబోతుండటంతో తమ పార్టీ అభ్యర్థిని రంగంలోకి దించాలని మూడు పార్టీలు ఆశిస్తున్నాయి. బీజేపీ ఈ మేయర్ పీఠాన్ని తమకు విడిచి పెట్టాలని కోరాలని డిసైడ్ అయిందట. 1979లో కాంగ్రెస్ పార్టీతో పోటీపడి మరీ ప్రత్యక్ష ఎన్నికల్లో మేయర్ పీఠాన్ని సొంతం చేసుకుంది బీజేపీ. అప్పుడు జనసంఘ్ రూపంలో ఉన్న బీజేపీ.. తొలిసారి విశాఖ మేయర్ అభ్యర్థిని గెలిపించుకొని హిష్టరీ క్రియేట్ చేసింది. ఇప్పటికీ విశాఖ నగరంలో బీజేపీకి మంచి పట్టు ఉన్నట్లు చెబుతుంటారు. మొన్నటి ఎన్నికల్లో విశాఖ ఎంపీ సీటు బీజేపీకి ఇస్తారని ప్రచారం నడిచింది. కాని పొత్తుల్లో భాగంగా పక్కనున్న అనకాపల్లి స్థానం బీజేపీకి దక్కగా.. అక్కడి నుంచి కమలం పార్టీ ఎంపీ అభ్యర్థిగా సీఎం రమేష్ గెలిచారు. విశాఖ గ్రేటర్ పరిధి అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో కూడా కొంత విస్తరించి ఉంటుంది. దీంతో తమకు గ్రేటర్ పీఠం ఇస్తే ఈజీగా గెలుచుకోవచ్చనే అంచనాల్లో ఉందట కమలం పార్టీ. సేమ్‌టైమ్ గత ఎన్నికల్లో తమకు విశాఖ ఎంపీ సీటు ఇవ్వకపోవడంతో.. ఇప్పుడు మేయర్ పీఠం అయినా వదిలేయాలని రిక్వెస్ట్ చేస్తున్నారు బీజేపీ నేతలు.విశాఖ మేయర్ సీటుతో పాటు.. విజయవాడ, తిరుపతి నగర పాలక సంస్థలపై కూడా బీజేపీ ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. గ్రేటర్ విశాఖ పరిధిలో బీజేపీకి ఓ ఎమ్మెల్యే, మరో ఎంపీ ఉన్నారు. 2014లో కూడా విశాఖ ఎంపీ సీటును బీజేపీ గెలిచింది. దీంతో తమకు పట్టున్న చోట మేయర్ సీటు దక్కించుకొని.. ఇంకా బలం పెంచుకునే ప్లాన్‌లో ఉన్నారట కమలనాథులు. ఇక గత ఎన్నికల్లో విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సీటును గెలుచుకున్న బీజేపీ.. బెజవాడ మేయర్ సీటుకోసం పట్టుబట్టేందుకు రెడీ అవుతోందట. తిరుపతి మేయర్ స్థానం కూడా తమకే ఇవ్వాలని కోరబోతోందట. కూటమి పెద్దల భేటీలో తమ వాదనను బలంగా వినిపించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. స్టేట్ మొత్తంలో అర్బన్ ఏరియాల్లో తమ ప్రాతినిధ్యాన్ని మరింత పెంచుకోవాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్మన్ పదవుల్లో పార్టీకి తగిన ప్రాధాన్యం దక్కేలా సీట్ల సర్దుబాట్లపై దృష్టి పెట్టాలని బీజేపీ డిసైడ్ అయిందట.

సింహపురిలో రియల్ జోరు

నెల్లూరు, : నెల్లూరు నగరంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కొత్త దారిలో వెళ్తోంది. నగర పరిధిలోని కీలకమైన మినీ బైపాస్ రోడ్డు, కృష్ణపట్నం పోర్ట్ కనెక్టివిటీ రహదారుల పొడవునా సెమీ-లగ్జరీ అపార్ట్‌మెంట్లు, ఆధునిక కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు భారీగా పుంజుకున్నాయి. జాతీయ రహదారి కి, పోర్ట్ రవాణా కారిడార్‌కు అనుసంధానంగా ఉన్న ఈ ప్రాంతాలు నివాస , వ్యాపార అవసరాలకు అనువుగా మారడంతో డెవలపర్లు సరికొత్త ప్రాజెక్టులతో ముందుకు వస్తున్నారు.కృష్ణపట్నం పోర్ట్ ఆధారిత లాజిస్టిక్స్, షిప్పింగ్ సంస్థలు, మైనింగ్ , మల్టీ-మోడల్ ట్రాన్స్‌పోర్ట్ రంగాలు శరవేగంగా విస్తరిస్తుండటంతో నెల్లూరు నగరంలో ఆయా కంపెనీల అధికారులు, ఇంజనీర్ల నివాస అవసరాలు పెరిగాయి. దీనికి తోడు మెరుగైన అద్దె ఆదాయం వస్తుండటంతో విదేశాల్లో ఉండే నెల్లూరు జిల్లావాసులు తమ పెట్టుబడులను మినీ బైపాస్ పరిసరాల్లోని సెమీ-లగ్జరీ ఫ్లాట్లు, కమర్షియల్ ప్రాపర్టీలపై కేంద్రీకరిస్తున్నారు. సేఫ్ ఇన్వెస్ట్‌మెంట్‌గా భావిస్తూ ముందస్తుగానే అపార్ట్‌మెంట్లను బుక్ చేసుకుంటున్నారు.మినీ బైపాస్ పరిసర ప్రాంతాలు నగరంలోని ప్రధాన ఆసుపత్రులు, విద్యాసంస్థలు, షాపింగ్ మాల్స్‌కు సమీపంలో ఉండటం కూడా కొనుగోలుదారులను విశేషంగా ఆకట్టుకుంటోంది. గతంలో కేవలం ఇండిపెండెంట్ ఇళ్లకు ప్రాధాన్యత ఇచ్చిన స్థానికులు, ఇప్పుడు సెక్యూరిటీ, పవర్ బ్యాకప్, జిమ్, కార్ పార్కింగ్ వంటి వసతులు ఉండే గేటెడ్ కమ్యూనిటీల వైపు మొగ్గు చూపుతున్నారు. దీనివల్ల ఇక్కడ చదరపు అడుగు ధర రూ. 4,000 నుంచి రూ. 6,000 వరకు పలుకుతోంది.పరిశ్రమల అభివృద్ధి, పోర్ట్ ఆధారిత వ్యాపారాల విస్తరణతో నెల్లూరు నగరం దక్షిణ కోస్తాలో కీలకమైన లాజిస్టిక్స్ హబ్‌గా రూపాంతరం చెందుతోంది. పొట్టి శ్రీరాములు నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ ఆమోదిత ప్రాజెక్టులకు డిమాండ్ నిరంతరం పెరుగుతుండటంతో, రాబోయే రోజుల్లో మినీ బైపాస్ మరియు పోర్ట్ రోడ్డు కారిడార్లలో ఆస్తుల విలువలు మరింత పెరిగే అవకాశం ఉందని రియల్టీ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

వారసుడిగా విమర్శలు - లోకేష్ పనితీరుపై పొగడ్తలు



విజయనగరం, : విజయనగరం జిల్లా భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం ముగించుకుని తిరుగుపయనమైన సందర్భంలో.. దేశ ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ భుజం తట్టి "శభాష్ లోకేశ్! చాలా బాగా పనిచేస్తున్నావు.. ఇదే వేగం, స్ఫూర్తితో ముందడుగు వేయి" అని అభినందించడం కేవలం ఒక సాధారణ వీడ్కోలు మర్యాద మాత్రమే కాదు. భారత రాజకీయాల్లో సీనియర్ నేతల గుర్తింపు పొందడం అంత సులభం కాని తరుణంలో, ప్రధాని స్థాయిలో లభించిన ఈ ఆత్మీయ ప్రశంసా వాక్యాలు నారా లోకేశ్ పాలనా నైపుణ్యానికి, క్రమశిక్షణతో కూడిన పట్టుదలకు దక్కిన జాతీయ స్థాయి ముద్రగా చెప్పుకోవచ్చు. తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారసుడిగా రాజకీయ అరంగేట్రం చేసిన ప్రారంభంలో లోకేశ్ తీవ్ర ప్రతికూల విమర్శలను, సోషల్ మీడియా ట్రోలింగ్‌ను ఎదుర్కొన్నారు. వారసత్వం అనే నైతిక బరువుతో ప్రయాణం ప్రారంభించిన ఆయన, విమర్శలను ఎదురుదాడికి సాకుగా మార్చుకోకుండా పరిపాలనా సామర్థ్యం, పక్కా కార్పొరేట్ మేనేజ్‌మెంట్ స్కిల్స్‌తో తనను తాను మలచుకున్నారు.

స్టీల్ ప్లాంట్ ఆస్తులు వేలం



విశాఖపట్టణం, : విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ మిగులు భూముల్ని మరోసారి వేలం నిర్వహించబోతున్నారు. విశాఖపట్నంలోని హెచ్‌బీ కాలనీ, గాజువాక ఆటోనగర్ ప్రాంతం ఉన్న 459 ప్లాట్ల విక్రయానికి ఎన్ఎల్ఎంసీ (నేషనల్ ల్యాండ్ మానిటైజేషన్ కార్పొరేషన్) రూ.858.68 కోట్ల రిజర్వ్ ధరతో ఈ?ఆక్షన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. నిధుల సమీకరణ, అసెట్ మానిటైజేషన్‌లో భాగంగా వేలంపాటకు సిద్ధమైనట్లు పేర్కొన్నారు. విశాఖపట్నంలోని సీతమ్మధార పరిధిలో ఉన్న హెచ్‌బీ కాలనీలో 456 ప్లాట్లు 87,949.77 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్నాయి.. వాటిని రూ.838.93 కోట్ల రిజర్వ్ ధరతో వేలానికి సిద్ధమయ్యారు. అలాగే గాజువాక ఆటోనగర్‌లోని బ్లాక్? 2లో 2,728 చదరపు గజాలలో, మూడు బ్లాక్?3లోని 2894.44 చదరపు గజాల్లో ఉన్న రూ.19.75 కోట్లు విలువైన ప్లాట్లను వేలం వేయనున్నారు.ఈ ఏడాది అక్టోబర్ 12వతేదీన ఉదయం 11 గంటల నుంచి 243 ప్లాట్లకు.. 16వతేదీన ఉదయం 11 గంటల నుంచి 216 ప్లాట్లకు వేలం నిర్వహించనున్నారు. అక్టోబర్ 12న 243 ప్లాట్లకు సంబంధించి వేలంలో పాల్గొనేవారు అక్టోబర్ 8 సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అధికారులు సూచించారు. అక్టోబర్ 16న 216 ప్లాట్లకు సంబంధించి వేలంలో పాల్గొనేవారు అక్టోబర్ 14 సాయంత్రం 5 గంటలలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఒకవేళ ఎవరైనా ఈ ప్లాట్లను చూడాలనుకుంటే కేవీ సుబ్బరాజు, 9849091798.. ఎం ఆంజనేయులు, 9989898999 నంబర్లలో సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.35 ఏళ్ల క్రితం విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు ఉద్యోగుల కోసం సీతమ్మధార ప్రాంతంలోని హెచ్‌బీ కాలనీలో 22.19 ఎకరాల విస్తీర్ణంలో 830 క్వార్టర్లు నిర్మించారు. కానీ స్టీల్‌ప్లాంట్‌కు 15 కిలోమీటర్ల దూరంలో ఈ ప్లాట్లు ఉండటంతో ఉద్యోగులు అక్కడ ఉండటానికి ఆసక్తి చూపించలేదు. ఈ క్వార్టర్లకు నరైన నిర్వహణ లేకపోవడంతో శిథిలమైపోయాయి. ప్రస్తుతం ఈ ప్లాట్లు ఉన్న ప్రాంతంలో భూముల ధరలు పెరిగాయి. అక్కడ గజం రూ.లక్షన్నర నుంచి రూ.2 లక్షలు పలుకుతోందని చెబుతున్నారు. గతంలో ఈ-వేలం ద్వారానే హెచ్‌బీ కాలనీలో కొన్ని ప్లాట్లు విక్రయించగా.. రూ.150 కోట్ల వరకు ఆదాయం వచ్చింది. ఇప్పుడు మరోసారి వేలానికి సిద్ధమవుతున్నారు. స్టీల్ ప్లాంట్ యాజమాన్యం విశాఖపట్నంలోని హెచ్‌బీ కాలనీ, ఆటోనగర్‌లో ఉన్న భూములు.. హైదరాబాద్, చెన్నై వంటి ప్రాంతాల్లో ఉన్న భూముల్ని విక్రయించేందుకు సిద్ధమైంది. కానీ ఈ భూముల విక్రయించొద్దంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ కోర్టులో పిల్ దాఖలు చేయడంతో స్టే విధించారు.. దీంతో కొన్నాళ్లు ఈ భూముల వేలం ప్రక్రియ ఆగిపోయింది.. మళ్లీ ఇప్పుడు మరోసారి భూముల వేలానికి సిద్ధమయ్యారు.

కూటమిలో మైక్రో మేనేజ్‌మెంట్



ఏలూరు, : నరసాపురం నియోజకవర్గంలో నిర్వహించిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్థానిక జనసేన ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పనితీరుపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేయడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీసింది. నియోజకవర్గానికి చెందిన 25 కేపీఐ సూచీల్లో 23 మైనస్ ఉన్నాయని సభాముఖంగా స్పష్టం చేస్తూ, నోడల్ అధికారిని మార్చాలని కలెక్టర్‌ను ఆదేశించడం, అధికారులకు గట్టిగా క్లాస్ తీసుకోవడం కలకలం రేపింది. పాలనా సంస్కరణలు, పనితీరు ఆధారిత నాయకత్వంపై చంద్రబాబుకు ఉన్న పట్టుకు ఇది నిదర్శనమే అయినా, మిత్రపక్ష ఎమ్మెల్యేను ప్రజల ముందే అలా నిలదీయడం కూటమి ధర్మానికి విఘాతం కలిగిస్తుందా అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.తెలుగుదేశం పార్టీ అధినేతగా సొంత పార్టీ ఎమ్మెల్యేలను, మంత్రులను చంద్రబాబు వేదికలపై లేదా సమీక్షా సమావేశాల్లో హెచ్చరించడం దశాబ్దాలుగా వస్తున్న శైలి. టీడీపీ ప్రజాప్రతినిధులు ఆ వ్యాఖ్యలను పార్టీ పెద్ద ఇచ్చే హెచ్చరికగా పరిగణిస్తారు. కానీ, కూటమి భాగస్వామి అయిన జనసేన పార్టీ ప్రజాప్రతినిధి విషయంలో అదే వ్యూహాన్ని వర్తింపజేయడం పొలిటికల్ ప్రోటోకాల్‌ను ఉల్లంఘించడమేనని భావిస్తున్నారు. జనసేన ఎమ్మెల్యేలు నేరుగా పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పనిచేస్తుండటంతో, వారి పనితీరుపై చర్యలు లేదా హెచ్చరికలు ఉంటే అంతర్గత సమన్వయ కమిటీల ద్వారా లేదా పవన్ కళ్యాణ్ ద్వారా ఇప్పించడమే సరైన పద్ధతిగా చెబుతున్నారు. ఈ బహిరంగ వ్యాఖ్యల పట్ల జనసేన కేడర్, జనసైనికులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. తమ ఎమ్మెల్యేకు పనితీరు సరిగా లేకపోతే సరిదిద్దే బాధ్యత తమ అధినేత పవన్ కళ్యాణ్‌ది అని, మైకుల ముందుకు వచ్చి ఒక నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఇమేజ్‌ను ప్రజల ముందు తగ్గించడం వల్ల రాబోయే రోజుల్లో గ్రౌండ్ లెవెల్‌లో కేడర్ మధ్య వైషమ్యాలు పెరుగుతాయని వారు ఆందోళన చెందుతున్నారు. మిత్రపక్ష నాయకుడి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా పబ్లిక్ వేదికలపై మాట్లాడటం వల్ల క్షేత్రస్థాయిలో టీడీపీ, జనసేన శ్రేణుల మధ్య ఉండాల్సిన ఐక్యత దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇది రాబోయే రోజుల్లో మరింత పెద్ద రాజకీయ వివాదానికి ఆజ్యం పోసే అవకాశముంది. రేపు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఏదైనా ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు, పాలనాపరమైన లోపాలున్న ఏదేని టీడీపీ ఎమ్మెల్యేను లేదా టీడీపీ మంత్రుల నియోజకవర్గాలను ఉద్దేశించి ఇదే తరహాలో వ్యాఖ్యలు చేస్తే పరిణామాలు ఎలా ఉంటాయనే ప్రశ్న వస్తోంది. పవన్ కళ్యాణ్ కూడా టీడీపీ ప్రజాప్రతినిధులపై బహిరంగంగా విమర్శలు గుప్పిస్తే, అది పొత్తు ధర్మానికి ముగింపు పలికి రెండు పార్టీల మధ్య పరస్పర దాడులకు దారితీస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డేటా-డ్రివెన్ గవర్నెన్స్‌కు, రిపోర్ట్ కార్డులకు అత్యంత ప్రాధాన్యమిస్తారు. పాలనలో సీనియారిటీ, పొత్తులు చూడకుండా పనితీరునే ప్రామాణికంగా తీసుకుంటారనే సందేశాన్ని ప్రజల్లోకి పంపాలనేది ఆయన ఆలోచన కావచ్చు. రాష్ట్రాభివృద్ధికి కూటమి స్థిరత్వం ఎంత ముఖ్యమో గ్రహించిన క్రమంలో, వ్యూహాత్మకంగా మైక్రో మేనేజ్‌మెంట్ వ్యాఖ్యలను అంతర్గత సమావేశాలకే పరిమితం చేయకపోవడం చంద్రబాబు చేసిన ఒక చిన్న రాజకీయ అంచనా పొరపాటేనని నిపుణులు భావిస్తున్నారు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందించాలంటే రిపోర్ట్ కార్డులను అమలు చేయడం ఎంత ముఖ్యమో, మిత్రపక్షాల ఆత్మగౌరవాన్ని కాపాడటం కూడా అంతే ముఖ్యమన్న భావన వ్యక్తమవుతోంది.

ఫలితాలను ఇస్తున్న అక్షర ఆంధ్ర



విజయవాడ, : దేశంలోనే అత్యంత తక్కువ అక్షరాస్యత కలిగిన రాష్ట్రాల్లో ఒకటిగా విమర్శలు ఎదుర్కొన్న ఆంధ్రప్రదేశ్, గత రెండేళ్లలో సాధించిన ప్రగతి విద్యా రంగంలో ఒక మైలురాయిగా నిలుస్తోంది. 2024 నాటికి కేవలం 72.6 శాతంగా ఉన్న అక్షరాస్యత, 2026 నాటికి ఏకంగా 82.1 శాతానికి చేరుకుంది. జాతీయ సగటు కంటే వెనుకబడిన స్థితి నుంచి కేవలం రెండేళ్ల వ్యవధిలోనే దాదాపు 10 శాతం మేర అక్షరాస్యత పెరగడం వెనుక విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ చేపట్టిన పక్కా ప్రణాళికలు, క్షేత్రస్థాయి పరిశీలన, రిజల్ట్-ఓరియంటెడ్ విధానాలే ప్రధాన కారణం.ఈ భారీ మార్పుకు అక్షర ఆంధ్ర కార్యక్రమం వెన్నెముకగా నిలిచింది. విద్యా శాఖను చేపట్టిన వెంటనే నారా లోకేష్, కేవలం పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతోనే సరిపెట్టకుండా ఫలితాలు ఆధారంగా పనిచేసే ప్రత్యేక కార్యాచరణను అమలు చేశారు. సుమారు 11 ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాలలో నిర్వహించిన అక్షరాస్యతా విభాగాలు, ఫీల్డ్ ప్రోగ్రామ్‌ల ద్వారా గత ఏడాది కాలంలోనే దాదాపు 25 లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చడం లోకేష్ పరిపాలనా దక్షతకు అద్దం పడుతోంది.అంతేకాకుండా, పాఠశాల విద్యలో డ్రాపౌట్లను తగ్గించి హాజరు శాతాన్ని పెంచడంపై మంత్రి లోకేష్ ప్రత్యేక దృష్టి సారించారు. ఒఇంఖ యాప్ ద్వారా బడికి దూరమైన 1.64 లక్షలకు పైగా పిల్లల డేటాను సేకరించి, వారిలో సుమారు 33 వేల మందిని తిరిగి పాఠశాలల్లో చేర్పించడం, టీచర్ల హాజరును 98.97 శాతానికి తీసుకెళ్లడం విద్యావ్యవస్థలో వచ్చిన సమూల మార్పుకు ఉదాహరణ. ఉపాధ్యాయుల కొరత తీర్చే దిశగా నిర్ణయాలు తీసుకోవడమే కాకుండా, తల్లికి వందనం, సాంకేతికత ఆధారిత పర్యవేక్షణ ద్వారా విద్యార్థుల్లో జవాబుదారీతనాన్ని లోకేష్ పెంచగలిగారు.ఇప్పుడు ప్రభుత్వం విధించుకున్న ప్రతిష్టాత్మక లక్ష్యం సెప్టెంబర్ 2027 నాటికి 100% సంపూర్ణ అక్షరాస్యత సాధించడం. దీనికోసం 2027 మార్చి నాటికి మరో 25 లక్షల మందిని, సెప్టెంబర్ 2027 నాటికి మిగిలిన 27 లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చడానికి ప్రజాప్రతినిధులను, స్థానిక సంస్థలను భాగస్వాములను చేస్తూ టైమ్-బౌండ్ టార్గెట్లను నిర్దేశించారు. ఇది కేవలం కాగితాలకే పరిమితం కాకుండా ప్రతీ నియోజకవర్గంలో కార్యాచరణ వేగవంతం అయ్యేలా ఐఏఎస్ అధికారులతో క్రమం తప్పకుండా చేస్తున్న సమీక్షలే ఈ వృద్ధికి బలం చేకూరుస్తున్నాయి.గడిచిన రెండేళ్లలో ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖలో నమోదైన ఈ గణనీయమైన మార్పు నారా లోకేష్ రాజకీయ, పరిపాలనా సామర్థ్యానికి ఒక బలమైన రుజువుగా నిలుస్తోంది. ఒకప్పుడు జాతీయ స్థాయిలో అక్షరాస్యతలో ఆఖరి వరుసల్లో నిలిచిన ఏపీని, 2027 నాటికి దేశంలోనే మొదటి సంపూర్ణ అక్షరాస్యత సాధించిన రాష్ట్రాలలో ఒకటిగా నిలిపేందుకు లోకేష్ వేస్తున్న అడుగులు ఆయన విజనరీ లీడర్‌షిప్‌ను స్పష్టం చేస్తున్నాయి.

ఆరణికి రాజకీయ ఇబ్బందులు



తిరుపతి, : కొందరు పార్టీలు మారి ఎమ్మెల్యేలు కావచ్చు. అంత మాత్రాన పట్టున్న నియోజకవర్గంలో కాలరెగరేస్తే రాజకీయ భవిష్యత్ ఇబ్బందుల్లో పడే అవకాశముంది. ప్రస్తుతం జనసేన తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పరిస్థితి కూడా అలాగే ఉంది. తిరుపతి నియోజకవర్గంలోని జనసేన నేతలు, కార్యకర్తల నుంచి ఆయన వ్యతిరేకత ఎదుర్కొంటున్నారు. ఇక కూటమిలోని మిత్ర పక్షాలు కూడా ఆయనకు మద్దతుగా నిలిచే అవకాశం కనిపించడం లేదు. ఆయన తిరువతి ఎమ్మెల్యే అయిన తర్వాత నియోజకవర్గాన్ని పట్టించుకోకపోవడంతో పాటు, తమను కూడా దూరం పెట్టడంతో కూటమిలోని మిత్ర పక్షాల నుంచి ఆరణికి రాజకీయ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆయనపై ఉన్న అసంతృప్తి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలపై పడే అవకాశముందన్న ఆందోళన జనసేన నేతల్లో ఉంది. స్థానిక క్యాడర్ నుంచి... తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుపై పార్టీ క్యాడర్, స్థానిక నాయకుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. జనసేన క్యాడర్‌ను పట్టించుకోకపోవడంతో పాటు అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ కార్యకర్తలను, సీనియర్లను ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.వైసీపీ నేతలతో సంబంధాలు కూడా ఆరణి శ్రీనివాసులుకు ఇబ్బందిగా మారాయంటున్నారు. కూటమి కార్యకర్తలను పక్కన పెట్టి, కొందరు వైసీపీ నేతలతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక మున్సిపల్ కార్పొరేషన్ వ్యవహారాలలో ఆరణి శ్రీనివాసులు ఎమ్మెల్యే బంధువులు, కుటుంబ సభ్యులు జోక్యం చేసుకోవడం వివాదాస్పదమైంది. ఇప్పటికే ఆరణి శ్రీనివాసులుపై సొంత పార్టీ నేతలే ఫిర్యాదు చేయడంతో సమన్వయంతో పనిచేయాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్వయంగా ఆయనకు సీరియస్ వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం. ఆరణి శ్రీనివాసులు వైసీపీ నుంచి జనసేనలోకి వచ్చారు. 2019 లో చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసీపీ తరుపున పోటీ చేసి విజయం సాధించారు. నాడు తిరుపతి ప్రాంతంలోని అనేక మంది వైసీపీ నేతలతో సంబంధాలున్నాయి. ప్రధానంగా భూమన కరుణాకర్ రెడ్డితో ఆయనకు సన్నిహిత్వం ఉందంటారు. అలాగే మరి కొందరు వైసీపీ నేతలను కూడా ఆయన దగ్గర తీస్తున్నారన్న ఆరోపణలున్నాయి. విపక్ష వైసీపీ చేసే విమర్శలకు కూడా ఆరణి శ్రీనివాసులు కౌంటర్ ఇవ్వకపోవడం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పై విమర్శలు చేసినా చూసీచూడనట్లు వ్యవహరించడంతో పార్టీ నాయకత్వం కూడా ఆయన వ్యవహార శైలి పట్ల ఆగ్రహంగా ఉందని తెలుస్తోంది. వివాదాలు లేకపోయినా.. అనేక ఆరోపణలు ఆరణి శ్రీనివాసులును చుట్టుముడుతుండటంతో ఆయన రాజకీయంగా ఇబ్బందులలో పడినట్లేనని సొంత పార్టీ నేతలే చెబుతుండటం విశేషం.

స్థానిక పోరుకు జనసేన సిద్ధం



కాకినాడ, : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో స్థానిక సంస్థల ఎన్నికల వేడి క్రమంగా రాజుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన చారిత్రాత్మక విజయంతో అధికారంలోకి వచ్చిన జనసేన పార్టీ, రాబోయే స్థానిక పోరులోనూ అదే ఊపును కొనసాగించడమే లక్ష్యంగా కీలక కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగానే కీలక ఆత్మీయ సమావేశం నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. క్షేత్రస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ఎన్నికల వ్యూహాలకు పదును పెట్టడమే ఈ భేటీ ప్రధాన ఉద్దేశం.ఈ విస్తృత స్థాయి సమావేశానికి జనసేన ప్రజాప్రతినిధులు, కీలక నేతలు హాజరుకానున్నారు. పార్టీకి చెందిన మంత్రులు, పార్లమెంట్ సభ్యులు , శాసనసభ్యులు , ఎమ్మెల్సీలతో పాటు వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లుగా ఎంపికైన నేతలకు పిలుపునిచ్చారు. వీటితో పాటు గత కష్టకాలంలో పార్టీ జెండాను మోసిన సీనియర్లకు సముచిత ప్రాధాన్యం ఇస్తూ.. 2019 సార్వత్రిక ఎన్నికలు, 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన తరఫున పోటీ చేసిన మాజీ అభ్యర్థులకు ప్రత్యేక ఆహ్వానాలు పంపారు.ఈ వేదికగా స్థానిక సంస్థల ఎన్నికల విధివిధానాలు, అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై రూపొందించిన 14 మంది సభ్యుల ప్రత్యేక కమిటీ సమగ్రంగా చర్చించనుంది. పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్దేశించిన మార్గదర్శకాలను, ఆయన సందేశాన్ని పార్టీ పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ నేతలకు కూలంకషంగా వివరించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కూటమి తరఫున సీట్ల సర్దుబాటు, అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాలు మరియు క్షేత్రస్థాయి సమన్వయంపై నాయకులకు స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారు.గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందినప్పటికీ నిలబడి పోరాడిన కేడర్‌కు స్థానిక సంస్థల్లో ప్రాధాన్యం కల్పించడంపై ఈ సమావేశంలో ప్రాథమిక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. గల్లీ స్థాయి నుంచి క్షేత్రస్థాయి నాయకత్వాన్ని రీచార్జ్ చేస్తూ, గ్రామ పంచాయతీ నుంచి జిల్లా పరిషత్, మున్సిపల్ పీఠాల వరకు విజయం సాధించడమే లక్ష్యంగా జనసేన వ్యూహరచన చేస్తోంది. పంచాయతీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అభ్యర్థులను ఖరారు చేయడంపై ఈ ఆత్మీయ సమావేశం ఒక దిక్సూచిలా మారబోతోంది.జనసేన 21 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ, రెండు పార్లమెంటు స్థానాల్లో గత ఎన్నికల్లో గెలిచింది. అయితే ఈసారి మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో వట్టున్న ప్రాంతాలను ఎంచుకోవాలని జనసేన భావిస్తుంది. అందుకు అవసరమైతే టీడీపీపై వత్తిడి కొంత పెంచి ఎన్నికలలో పోటీ చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే పవన్ కళ్యాణ్ వీరమహిళలు, జనసైనికులకు సంతృప్తి కలిగేలా వాటా ఉంటుందని, అదే సమయంలో కూటమి మధ్య మిత్రత్వాన్ని కొనసాగిస్తూనే అవసరమైన సీట్లను సాధించడం కోసం పట్టుబడతామని చెప్పింది. అయితే చూచాయగా అందిన సమాచారం మేరకు జనసేన ఏపీలోని పదహారు కార్పొరేషన్లలో ఐదింటిలో పోటీ చేయాలని భావిస్తుంది. ఇప్పటికే దీనిపై ఒక అభిప్రాయానికి వచ్చిన జనసేన కార్పొరేషన్ లలో తాము పోటీ చేసే స్థానాల విషయంలో క్లారిటీకి వచ్చినట్లు ఉందని పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ, కాకినాడ, తిరుపతి, ఒంగోలు,. ఏలూరు కార్పొరేషన్లనలో మేయర్ పదవిని జనసేన కోరే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే మొత్తం పదహారు కార్పొరేషన్లలలో ఐదు అంటే ఎక్కువేనని టీడీపీ నేతలు అభిప్రాయపడుతున్నారు. విజయవాడ కార్పొరేషన్ ను వదులుకునేందుకు టీడీపీ సిద్ధంగా ఉండదు. అలాగే ఏలూరు కార్పొరేషన్ విషయంలోనూ టీడీపీ పట్టుబట్టే అవకాశముంది. ఇక తిరుపతి విషయంలో గత శాసనసభ ఎన్నికల్లో అసెంబ్లీ స్థానం కేటాయించాం కాబట్టి ఈ సారి మేయర్ స్థానం తమకు ఇవ్వాలని జనసేన ముందు టీడీపీ కొంత ప్రతిపాదన పెట్టే అవకాశముంది. ఇక కాకినాడ కార్పొరేషన్ లో ఎటువంటి ఇబ్బందులు లేవు. అలాగే ఒంగోలు కార్పొరేషన్ ను కూడా టీడీపీ వదులుకునేందుకు సిద్ధపడకపోవచ్చు. అక్కడ పట్టు పోకుండా ఉండాలంటే కార్పొరేషన్ తమ గ్రిప్ లో ఉంచుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ పట్టుబట్టవచ్చు. ఇవి కాకుండా మిగిలిన చోటా చోటా కార్పొరేషన్లకు ఇచ్చేందుకు టీడీపీ సిద్ధపడవచ్చు. ఐదు కార్పొరేషన్లకు మూడు కార్పొరేషన్లు జనసేనకు కేటాయించే అవకాశాలున్నాయి.

మళ్లీ పాత నియోజకవర్గాల కోసం డిమాండ్



విజయవాడ, : వైసీపీ నేతలు తమ పాత నియోజకవర్గాలను కేటాయించాలని పార్టీ హైకమాండ్ పై వత్తిడి తెస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలంటే ఖచ్చితంగా కూటమి పార్టీలకు గట్టి పోటీని ఇవ్వాలంటే తమకు పాత నియోజకవర్గాలకు పంపాలని కోరుతున్నారు. ఈ వాయిస్ ఇటీవల కాలంలో పార్టీ అధినేత జగన్ వద్ద ఎక్కువగా వినిపిస్తుంది. జగన్ జిల్లాల పర్యటనలకు వచ్చినప్పుడు కానీ, తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశమయినప్పుడు కానీ ఇదే విషయాన్ని పదే పదే ప్రస్తావిస్తున్నారట. తమకు ఇష్టం లేని, పరిచయాలు లేని నియోజకవర్గాల్లోనే కొనసాగిస్తే లోకల్ బాడీ ఎన్నికల్లో పార్టీకి ఇబ్బందికరమైన పరిస్థితులుంటాయని హెచ్చరిస్తున్నారట. తర్వాత తమను నిందించి, ఓటమిని తమ ఖాతాల్లో వేయవద్దని కోరుతున్నట్లు తెలిసింది. 2024 ఎన్నికలకు వైసీపీ అనేక ప్రయోగాలు చేసింది. అందులో ఒకటి మంత్రులతో పాటు ఎమ్మెల్యేలను వారి సొంత నియోజకవర్గాల నుంచి తప్పించి కొత్త నియోజకవర్గాలకు అభ్యర్థులుగా పంపింది. కొత్త అభ్యర్థులయితే.. స్థానికంగా ఉండే అసంతృప్తి నుంచి బయటపడి గెలవచ్చని నాడు జగన్ తీసుకున్న నిర్ణయం ఫలించలేదు. ఒకరకంగా చెప్పాలంటే ఆ బదిలీ వ్యూహం వికటించిందనే చెప్పాలి. మంత్రులుగా ఉన్న విడదల రజని, తానేటి వనిత, మేకపాటి సుచరిత, ఆదిమూలం సురేష్, అనిల్ కుమార్ యాదవ్, వెల్లంపల్లి శ్రీనివాస్ తో పాటు అనేక మంది ఎమ్మెల్యేలను మార్చి జగన్ నాడు పెద్ద ప్రయోగమే చేశారు. కానీ ఇష్టం లేకుండానే అక్కడకు వెళ్లిన నేతలు దాదాపుగా అందరూ ఓటమి పాలయ్యారు. వైసీపీకి కేవలం పదకొండు స్థానాలకే పరిమితమై ప్రతిపక్ష కూడా హోదా దక్కకపోవడానికి ఈ మార్పిడి నిర్ణయమూ ఒక కారణమంటున్నారు... దీంతో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ లోజరగనున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలలో గెలవాలంటే తమ పాత నియోజకవర్గాలకు పంపాలని వైసీపీ నేతలు నాయకత్వానికి మొర పెట్టుకుంటున్నారు. కానీ జగన్ మాత్రం ఇప్పటి వరకూ దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. స్థానిక సంస్థల ఎన్నికల సమయం ముంచుకొస్తుండటంతో జగన్ విజయవాడ వచ్చినప్పుడల్లా కలసి తమ బాధను చెప్పుకుంటున్నారు. అయితే నవ్వడం మినహా జగన్ నుంచి నిర్ణయం వెలువడక పోవడంతో కొంత ఇబ్బంది కరమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కొత్త నియోజకవర్గాల్లో ఓటమి తర్వాత ఆ నేతలు క్యాడర్ కు దూరంగా ఉంటూ వస్తున్నారు. అలాగే తమకు బలం ఎక్కడ ఉంది? ఎక్కడ ప్రతిపక్షం బలంగా ఉందన్న విషయం తెలియదని, అందుకే తమకు ఓల్డ్ ఈజ్ గోల్డ్ అని చెబుతున్న నేతల మొర జగన్ పట్టించుకుంటారా? లేదా? అన్నది చూడాలి.

గెలుపే ధ్యేయంగా వైసీపీ వ్యూహం

వచ్చే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా వైసీపీ వ్యూహం మార్చిందా అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. ఈ మధ్యకాలంలో వైసీపీ నేతల వ్యాఖ్యలతో పాటే, నిరసనలు, ఆందోళనల్లో వినిపిస్తున్న ఆ పేరే.. దీనికి బలం చేకూరుస్తోంది. తాజాగా డీఎస్సీ అక్రమాలపై చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాలపై దాడులు జరుగుతున్నాయని ఆరోపిస్తూ వైసీపీ అధినేత వైఎస్ జగన్ చేసిన ట్వీట్‌లోనూ ఇదే పదం కనిపించడంతో.. రాజకీయ నిపుణులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.2029 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యూహం మార్చిందా.. ఢిల్లీ ప్రభావం ఏపీలోని గల్లీలైనా పడిందా.. అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి.

జాగ్రత్తగా ట్యాబ్లెట్లను బటానీల్లా తినేస్తున్నారా...?



తలనొప్పి, జ్వరం, ఎసిడిటీ వంటి సాధారణ సమస్యలకు డాక్టర్ సలహా లేకుండా మందులు వాడటం ఆరోగ్యానికి ప్రమాదకరమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. స్వీయ వైద్యం వల్ల లక్షణాలు తాత్కాలికంగా తగ్గినా, అసలు వ్యాధి గుర్తించడంలో ఆలస్యం జరిగి సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. తలనొప్పి, జ్వరం, ఎసిడిటీ, ఒళ్లు నొప్పులు వంటి సాధారణ సమస్యలు వచ్చినప్పుడు చాలా మంది వైద్యుడిని సంప్రదించకుండా స్వయంగా మందులు కొనుగోలు చేసి వాడుతుంటారు. ఈ అలవాటు తాత్కాలిక ఉపశమనం కలిగించినప్పటికీ, దీర్ఘకాలంలో ఆరోగ్యానికి తీవ్రమైన హాని కలిగించే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ముఖ్యంగా స్వీయ వైద్యం వల్ల అసలు వ్యాధి గుర్తించడంలో ఆలస్యం కావడంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. ప్రతి మందు ఒక నిర్దిష్ట వ్యాధి లేదా పరిస్థితికి అనుగుణంగా వైద్యులు సూచిస్తారు. వ్యాధి కారణాన్ని తెలుసుకోకుండా అదే మందును పదేపదే వాడటం వల్ల లక్షణాలు కొంతవరకు తగ్గినా, అసలు సమస్య మాత్రం అలాగే కొనసాగవచ్చు.

ఫలితంగా వ్యాధి మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఆలస్యంగా గుర్తించబడే అవకాశమూ ఉంది. ఇప్పటికే ఇతర అనారోగ్యాలకు మందులు వాడుతున్న వ్యక్తులు వైద్యుల సలహా లేకుండా కొత్త మందులు తీసుకుంటే ఔషధాల మధ్య పరస్పర చర్యలు జరిగే అవకాశం ఉంటుంది. దీనివల్ల అలర్జీలు, కాలేయం లేదా మూత్రపిండాలపై ప్రభావం, ఇతర అనుకోని దుష్ప్రభావాలు తలెత్తవచ్చు. అందుకే వైద్యుడిని సంప్రదించే సమయంలో ప్రస్తుతం వాడుతున్న అన్ని మందులు, విటమిన్లు, ఆయుర్వేద లేదా మూలికా ఉత్పత్తుల వివరాలను తెలియజేయడం అవసరం. జలుబు, దగ్గు వంటి సాధారణ సమస్యలకు కూడా చాలామంది యాంటీబయాటిక్స్‌ను స్వయంగా వాడుతుంటారు. అయితే అవసరం లేకుండా యాంటీబయాటిక్స్ తీసుకోవడం లేదా వైద్యుడు సూచించిన పూర్తి కోర్సును పూర్తి చేయకపోవడం వల్ల యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ ఏర్పడుతుంది. దీంతో భవిష్యత్తులో వచ్చే ఇన్ఫెక్షన్లకు చికిత్స చేయడం కష్టతరమవుతుంది. చిన్నపాటి అసౌకర్యాలకు వెంటనే మందులపై ఆధారపడకుండా ముందుగా విశ్రాంతి, సరైన ఆహారం, తగినంత నీరు తీసుకోవడం వంటి చర్యలు తీసుకోవాలి.

అయితే సమస్య పదేపదే వస్తుంటే, తీవ్రంగా ఉంటే లేదా కొన్ని రోజులైనా తగ్గకపోతే తప్పనిసరిగా వైద్యుడిని సంప్రదించాలి.

తక్షణ శక్తినిచ్చే ఈ డ్రింక్ ఒక్కసారి ట్రై చేయండి



మనలో ఎంతో మంది విపరీత వేడితో ఇబ్బంది పడతారు. దీనిని క్షణాల్లో తగ్గించుకోవాలంటే ఈ డ్రింక్ తాగితే సరిపోతుంది. ఇది తాగితే, హెల్తీగా ఉంటారు. సత్తు పిండి డ్రింక్ రెసిపీకి కావలసిన పదార్థాలు: నాలుగు టేబుల్ స్పూన్స్ సత్తు పిండి, రెండు గ్లాస్ లు చల్లటి నీరు, రెండు టేబుల్ స్పూన్స్ బెల్లం పొడి, ఒక టేబుల్ స్పూన్ జీలకర్ర పొడి, పావు టేబుల్ స్పూన్ యాలకుల పొడి, ఒక టేబుల్ స్పూన్ నిమ్మరసం, రుచికి సరిపడా చిటికెడు ఉప్పు, నాలుగు ఐస్ క్యూబ్స్ ,తరిగి పెట్టుకున్న పుదీనా ఆకులను తీసుకోవాలి. సత్తు పిండి డ్రింక్ రెసిపీ తయారీ విధానం స్టెప్ 1 : ఒక గిన్నెలో సత్తు పిండిని తీసుకుని, దానిలో కొద్దిగా నీరు పోసి ఉండలు లేకుండా దీనిని మంచిగా కలుపుకోవాలి. ఆ తర్వాత దీనిలో కొద్దిగా చల్లటి నీటిని పోస్తూ మిక్స్ చెయ్యాలి. ఇంకా దీనిలో కొద్దిగా ఇప్పుడు బెల్లం కూడా పొడి వేసి మొత్తం కరిగేపోయే వరకు కలపాలి. సత్తు పిండి డ్రింక్ రెసిపీ తయారీ విధానం స్టెప్ 2 : ఒక టేబుల్ స్పూన్ యాలకుల పొడి, రుచికి సరిపడా ఉప్పు వేసి ఒకటికి రెండు సార్లు బాగా కలపాలి. ఇంకా దీనిలో మీరు కావాలనుకుంటే కొద్దిగా నిమ్మరసం కూడా వేసి ఈ టెస్ట్ ను ఎక్కువ పెంచుకోవచ్చు. ఇంకా దీనిలో నాలుగు పుదీనా ఆకులు కూడా వేసి కలిపితే ఫ్రెష్ గా ఉంటుంది. సత్తు పిండి డ్రింక్ రెసిపీ తయారీ విధానం స్టెప్ 3 : ఇంకా ఈ గ్లాస్‌లో నాలుగు ఐస్ క్యూబ్స్ వేసి సత్తు పిండి డ్రింక్ పోయాలి. దీని పైన అర టేబుల్ స్పూన్ యాలకుల పొడి చల్లితే రుచి అద్భుతం అని చెప్పాలి. ఇంకా ఇలా తయారు చేసుకున్న తరవాత దీనిని చల్లగా తాగితే అబ్బబ్బా సూపర్ అంటూ తాగుతారు. మీరు దీనిని ఉదయం పూట టిఫిన్ తో పాటు దీనిని తీసుకోవచ్చు ఇంకా స్నాక్ టైమ్‌లో కూడా తాగొచ్చు.

ఈ సాల్ట్ ఎంత ప్రమాదమో తెలుసా..?



నేటి ఆధునిక జీవనశైలిలో ఫాస్ట్ ఫుడ్స్, జంక్ ఫుడ్స్ తినడం ఒక అలవాటుగా మారిపోయింది. నూడుల్స్, ఫ్రైడ్ రైస్, సూప్స్, మంచూరియా వంటి చైనీస్ వంటకాలకు ఆ ప్రత్యేకమైన కరకరలాడే రుచిని, మంచి సువాసనను అందించడానికి ఒక ప్రత్యేకమైన సాల్ట్‌ను ఉపయోగిస్తారు.

దానినే మనం అజినోమోటో లేదా చైనా ఉప్పు అంటాం. సైంటిఫిక్ భాషలో దీనిని మోనోసోడియం గ్లూటామేట్ (ఓఊ) అంటారు. అయితే, అజినోమోటో తింటే హార్ట్ ఎటాక్ వస్తుందని, బీపీ పెరుగుతుందని, మెదడు పాడవుతుందనే ప్రచారాలు ఎప్పటి నుంచో ఉన్నాయి. నాడీ వ్యవస్థ, మెదడుపై ప్రభావం: చైనీస్ వంటకాల్లో వాడే అజినోమోటో మానవ నాడీ వ్యవస్థను (ఔవతీలనీబీబ ూఎబబివఎ) తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ఇందులోని గ్లుటామిక్ యాసిడ్ మెదడులో సమాచారాన్ని చేరవేసే న్యూరోట్రాన్స్‌మిటర్‌గా పనిచేస్తుంది. మనం తింటున్న ఆహారం ద్వారా ఈ యాసిడ్ శరీరంలో విపరీతంగా ఎక్కువైతే, అది మెదడు పనితీరును దెబ్బతీసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. విపరీతమైన ఆకలి, ఊబకాయం:

అజినోమోటోకు ఒక ప్రత్యేకమైన గుణం ఉంది. ఇది నాలుకపై ఉండే రుచి గ్రంథులను ఉత్తేజపరచడమే కాకుండా, మన ఆకలిని విపరీతంగా పెంచుతుంది. దీనివల్ల కడుపు నిండినప్పటికీ మళ్లీ మళ్లీ తినాలనే కోరిక కలుగుతుంది. ఇలా పదే పదే జంక్ ఫుడ్స్ తినడం వల్ల శరీరంలో క్యాలరీలు పెరిగిపోయి, వేగంగా బరువు పెరగడం, ఊబకాయం (ూఎవబతిబిఎ) వంటి సమస్యలు వస్తాయి.

రక్తహీనతను దూరం చేసి సాంప్రదాయ వంటకం



పాతకాలం నాటి తెలంగాణా సాంప్రదాయ ఈ వంటకం గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. ఈ తియ్యటి వంటకం మీరు తింటే మళ్ళీ మళ్ళీ తింటారు. అలాగే రక్తహీనతను దూరం చేస్తుంది. మీరు కూడా మీ ఇంట్లో తప్పక ట్రై చేయండి. మీరు ఈ తీపి వంటకం తింటే, ఆరోగ్యంగా ఉంటారు. పాతకాలం నాటి తెలంగాణా సాంప్రదాయ ఈ వంటకం గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. ఈ తియ్యటి వంటకం మీరు తింటే మళ్ళీ మళ్ళీ తింటారు. అలాగే రక్తహీనతను దూరం చేస్తుంది. మీరు కూడా మీ ఇంట్లో తప్పక ట్రై చేయండి. మీరు ఈ తీపి వంటకం తింటే, ఆరోగ్యంగా ఉంటారు. తెలంగాణ సాంప్రదాయ వంటకం బెల్లం పాశానికి కావలసిన పదార్థాలు : రెండు కప్పుల బియ్యం, కప్పున్నర బెల్లం తురుము , ఒక కప్పుల పాలను తీసుకోవాలి, రెండు టేబుల్ స్పూన్స్ నెయ్యి, ఒక టీ స్పూన్ యాలకుల పొడి, 5 జీడిపప్పు, 5 కిస్మిస్ లు రెడీ చేసి పెట్టుకోవాలి. మీ వీటిని వేరు వేరుగా తీసుకోవాలి. దీని కోసం ఎక్కువ టైం పెట్టాల్సిన అవసరం లేదు కొద్ది నిముషాల్లోనే అవుతుంది. ముందుగా బియ్యాన్ని బాగా ఉడికించాలి : ముందుగా రెండు కప్పుల బియ్యాన్ని తీసుకుని నీటితో కడిగి బాగా ఉడికించాలి. అయితే, మరి మెత్తగా కాకుండా వీటిని బాగా ఉడికించుకోవాలి.

టాలీవుడ్‌లో సాక్షి మడోల్కర్ జోరు.....



మోగ్లీ' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన నటి సాక్షి మడోల్కర్, టాలీవుడ్‌లో వరుస అవకాశాలు దక్కించుకుంటూ దూసుకుపోతున్నారు. ఇప్పటికే శ్రీవిష్ణు, రామ్ అబ్బరాజు కాంబోలో రాబోతున్న చిత్రంలో ఛాన్స్ కొట్టేసిన ఈ బ్యూటీ, తాజాగా మరో క్రేజీ ఆఫర్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా తెరకెక్కుతున్న లేటెస్ట్ కామెడీ ఎంటర్‌టైనర్‌లో ఆమె హీరోయిన్‌గా ఎంపికయ్యారు. సాక్షి మడోల్కర్ పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. ప్రత్యేక పోస్టర్‌ను షేర్ చేస్తూ ఈ కన్ఫర్మేషన్ ఇచ్చారు. అనిల్ కుమార్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్ 42గా సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. ఇప్పటికే పూజా కార్యక్రమాలు ఘనంగా పూర్తి చేసుకున్న ఈ సినిమా, త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. సిద్ధు సరసన నటిస్తుండటంతో సాక్షి కెరీర్‌కు ఈ ప్రాజెక్ట్ ప్లస్ కానుందని నెట్టింట చర్చ సాగుతోంది.

నేను నా హద్దులను ఎప్పటికీ దాటను!



కోలీవుడ్ యంగ్ బ్యూటీ దర్శా గుప్తా బుల్లితెర సీరియల్స్ ద్వారా నటిగా ఎంట్రీ ఇచ్చి, తన నటనతో ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్నారు. ఆ తర్వాత సినిమాలపై ఉన్న ఆసక్తితో 'రుద్ర తాండవం' అనే యాక్షన్ థ్రిల్లర్ చిత్రంతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి, ఓమై గోస్ట్ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం యోగిబాబు సరసన 'మెడికల్ మిరాకిల్' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ పొలిటికల్ కామెడీ డ్రామా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ మూవీ షూటింగ్‌లో ఫుల్ బిజీ అయిపోయాన దర్శా, సోషల్ మీడియాలో ఎంతో యాక్టివ్‌గా ఉంటారు. తన హాట్ ఫొటోలను షేర్ చేస్తూ నెట్టింట నిత్యం వార్తల్లో నిలుస్తుంటారు. ఈ క్రమంలోనే ఆమె పోస్ట్ చేసే కొన్ని హాట్ ఫొటోలు వైరల్ కాగా.. హద్దులు మీరుతోందంటూ నెటిజన్ల నుంచి విమర్శలు వచ్చాయి. తాజాగా ఈ విమర్శలపై దర్శా గుప్తా స్పందిస్తూ నెటిజన్లకు గట్టి కౌంటర్ ఇచ్చారు. "నాసోషల్ మీడియాలో ఉన్న అభిమానులు నాకు సొంత కుటుంబం లాంటివారు. వారు నా పుట్టినరోజున లేదా ఇతర ప్రత్యేక రోజుల్లో శుభాకాంక్షలు చెబుతారని, నాతో నేరుగా మాట్లాడతారని అనుకున్నాను. నేను సోషల్ మీడియాలో చేరడానికి ఏకైక కారణం ఇదేనని మురుగన్ స్వామి సాక్షిగా చెబుతున్నాను" అని అన్నారు. అలాగే "ఈ ప్రపంచంలో నావెనుక ఏం జరుగుతుందో నాకు తెలియదు. మాఅమ్మ నేర్పించిన పద్ధతులు, విలువల ప్రకారమే నేను జీవిస్తున్నాను. నేను సెక్సీ ఫొటోలు పోస్ట్ చేయవచ్చు.. కానీ నాకు కొన్ని స్పష్టమైన హద్దులు ఉన్నాయి. ఎంత డబ్బు, కీర్తి వచ్చినా నేను ఆ హద్దులను ఎప్పటికీ దాటను. నన్ను విమర్శించినంత మాత్రాన నేనేమీ బాధపడను" అంటూ దర్శా గుప్తా చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఆమె చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

పాన్ ఇండియాగా 'ఇంద్ర పుత్ర'...



ఇటీవలే 'చెన్నై లవ్‌స్టోరీ'తో ప్రేక్షకుల్ని పలకరించారు కిరణ్ అబ్బవరం. ఇప్పుడాయన హీరోగా ఓ పాన్ ఇండియా సినిమాని ప్రకటించారు. 'ఇంద్రపుత్ర: ఫస్ట్ చాప్టర్' పేరుతో తెరకెక్కనున్న ఈ చిత్రానికి శ్రీకాంత్ పుప్పాల దర్శకత్వం వహిస్తున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా నిర్మిస్తున్నారు. ఈ సినిమాని సోమవారం అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్మాత ప్రేరణ అరోరా మాట్లాడుతూ.. "మన పురాణాల్లో ధర్మానికి.. అధర్మానికి మధ్య జరిగే పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఇప్పటి ట్రెండ్‌కు తగిన మేకింగ్‌తో ఈ సినిమాని నిర్మిస్తున్నాం. దీనితో మేము ఓ సరికొత్త సినిమాటిక్ వరల్డ్‌ని సృష్టించబోతున్నాం. కిరణ్ ఇందులో ఓ శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. భాషలకు అతీతంగా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా దీన్ని ముస్తాబు చేయనున్నాం. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అక్టోబరు నుంచి రెగ్యులర్ చిత్రీకరణ మొదలవుతుంది. వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది" అన్నారు.

ఆకట్టుకుంటున్న 'ఐయామ్ గేమ్' ఫస్ట్ సింగిల్



మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న సరికొత్త స్టైలిష్ యాక్షన్ స్పోర్ట్స్ థ్రిల్లర్ 'ఐయామ్ గేమ్'. నహాస్ హిదాయత్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కాయదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఆంటోని వర్గీస్, సంయుక్త విశ్వనాథన్, మైస్విన్ కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు. వేఫేరర్ ఫిలిమ్స్ బ్యానర్‌పై దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ స్వరాన్ని అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఆగస్టు 20న ఓణం పండుగ సందర్భంగా థియేటర్లలో విడుదల చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. ఇక సినిమా విడుదల టైమ్ దగ్గర పడటంతో.. తాజాగా మ్యూజికల్ జర్నీని స్టార్ట్ చేశారు. ఇందులోని మొదటి పాట 'ఎవరే నువ్వే నాకేమవుతావే'ను విడుదల చేశారు. ఈ పాటలో దుల్కర్ సల్మాన్, కాయదు లోహర్ మధ్య చూపించిన అనురాగం, వారి సైగలు ప్రతీ ఒక్కరినీ ఆకట్టుకుంటున్నాయి. "ప్రతి కాలంలోనూ ఆ రంగులంటే చాలా ఇష్టం" అనే క్యాప్షన్‌ను జత చేసి ఈ పాటను వదిలారు.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com